విశాలాంధ్ర
ఆదివారం 10, డిసెంబర్, 2023

పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలి

ఏపీ వ్య.కా.స జిల్లా అధ్యక్ష, కార్యదర్శి కండిపల్లి భీముడు, పురం అప్పారావు డిమాండ్

విశాలాంధ్ర-శృంగవరపుకోట: మిగ్జాంగ్ తుఫాను వర్షాలు కారణంగా ఎస్.కోట మండలంలో సుమారు 2వేల ఎకరాల్లో వరి పంట నీటమునిగి రైతులు నష్టపోయారని, అటువంటి పంట నష్టపోయిన రైతులను త్వరితగతిన గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం (సీపీఐ అనుబంధం) జిల్లా అధ్యక్షుడు కండిపల్లి భీముడు, ప్రధాన కార్యదర్శి పురం అప్పారావులు డిమాండ్ చేశారు. ఎస్.కోట మండలం, వెంకటరమణపేట గ్రామంలోని నీటమునిగిన రైతుల పొలాలను శనివారం ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నేతలు పరిశీలించారు. మిగచాంగ్ తుఫాన్ వలన చుక్క రాబాబు అను కౌలు రైతుకి చెందిన వరి పంట పొలాలను పరిశీలించగా ఎకరా 50 సెంట్లలో రూ. 38 వేలు పెట్టుబడులు పెట్టామని, ఒక్క గింజకూడా పనికిరాలేదని రైతు వాపోయాడు. మునిగిన వరి కుప్పల నుండి ధాన్యం మొలకలు వచ్చి రంగుమారి పోయిందన్నారు. ఈ రంగు మారిన ధాన్యం కొనుగోలు చేస్తేనే మా కుటుంబం అప్పుల బారి నుండి బయట పడుతుందని, లేకుంటే మరి వ్యవసాయం చేయలేని పరిస్థితి ఏర్పడుతుందని రైతులు బోరుమంటున్నారు. ఎ.పి.వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా అధ్యక్షుడు భీముడు, కార్యదర్శి అప్పారావు మాట్లాడుతూ భారీ వర్షాలు కారణంగా పంట నష్ట పోయిన ప్రతి రైతుకు ఎకరానికి 40 వేలు రూ.లు ఇస్తూ

వ్యవసాయ కార్మికులకు ఉపాధి హామీ పనులు కల్పించాలని, చుక్క రాంబాబు లాంటి కౌలు రైతులు మండల వ్యాప్తంగా సుమారు 200 మందికి కౌలు రైతు కార్డులు ఇవ్వవలసిందిగా కోరారు. ఇక క్షేత్ర స్థాయిలో వర్షాలు కారణంగా దెబ్బతిన్న పంటలను పరిశీలించి ప్రభుత్వం తగు ఆర్థిక సాయం చేయాలని సూచించారు. అలాగే రైతులు వద్ద కళ్లాల్లో ఉన్న ధాన్యం వెంటనే కొనుగోలు చేసి వారి ఖాతాల్లో నిధులు జమ చేయాలని, అపరాల విత్తనాలను రైతులకు ఉచితంగా అందజేయాలని డిమాండ్ చేశారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

బేబీ నాయన

=**విశాలాంధ్ర-రామభద్రపురం:** మిచాంగ్ తుఫాన్ వలన నష్టపోయిన రైతులను ప్రభుత్వము తక్షణమే ఆదుకొని వారికి నష్ట పరిహారం చెల్లించాలని బొబ్బిలి తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి నాయకులు బేబీ నాయన అన్నారు. శనివారం రామభద్రపురం కేంద్రంలో ఇట్లా మాడిపల్లి రోడ్లు రోడ్డు పక్కన తుఫానుకు దెబ్బతిన్న వరి పంట కూరగాయ పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులను ఆదుకోవడంలో ఈ ప్రభుత్వము చాలా ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. రైతు ప్రభుత్వం అని చెప్పి రైతులను

నట్టేట ముంచడంలో వైకాపా ప్రభుత్వం మొదటి స్థానంలో ఉందని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి హెలికాప్టర్లో చక్కెరలు కొట్టడమే నేరుగా రైతులు వద్దకు వెళ్లి దెబ్బతిన్న పంటలను పరిశీలించడం లేదని అన్నారు. కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కరణం విజయభాస్కర్ పలువురు తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్ లో 134 కేసులు పరిష్కారం

-సత్వర న్యాయం కోసం జాతీయ లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలి
-సీనియర్ సివిల్ జడ్జి మండల న్యాయ సేవాసంస్థ చైర్మన్ వాసుదేవన్

విశాలాంధ్ర-బొబ్బిలి : వివిధ కోర్టులో పెండింగ్లో ఉన్న కేసులు పరిష్కారం కోసం సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అమలవుతున్న జాతీయ లోక్ అదాలత్‌లో సత్వర న్యాయం కోసం నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి మండల న్యాయ సేవాసంస్థ చైర్మన్ టి వాసుదేవన్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక కోర్టు ప్రాంగణంలో సీనియర్ సివిల్ జడ్జి మండల న్యాయ సేవా సంస్థ చైర్మన్ టి వాసుదేవన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ లో 134 కేసులు పరిష్కారం చేసినట్లు విలేకరులకు తెలిపారు. మండల న్యాయ సేవా సంస్థ చైర్మన్ సీనియర్ సివిల్ జడ్జి టి వాసుదేవన్ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ సభ్యులు న్యాయవాది జీ కృష్ణ, ఒక బెంచిగాను, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం సరోజినమ్మ , జాతీయ లోక్ అదాలత్ సభ్యులు న్యాయవాది పాతుల మురళీకృష్ణ ఒక బెంచిగాను, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జె సౌమ్య జోష్నాని , న్యాయవాది వై షణ్ముఖ రావ్ బెంచిగాను ఏర్పడి సివిల్ కేసులో 11, సివిల్ టైటిల్ కేసు ఒకటి, ఏపీలో 5, చెక్ బౌన్స్ కేసులు రెండు, అపీల్ రెండు కేసులు, పిలుపు దావాలు రెండు, మెయింటినెన్స్ కేసులు రెండు, సీసీ క్యాలెండర్ కేసులు 44, సీసీ ఎక్సైజ్ కేసులు 61, పి ఎల్ సి బ్యాంక్ కేసులు రెండు, పి ఎల్ సి పంపకం కేసు ఒకటి, పరిష్కారం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి మండల న్యాయ సేవా సంస్థ చైర్మన్ టి వాసుదేవన్ మాట్లాడుతూ సత్వర న్యాయం కోసం జాతీయ లోక్ అదాలత్ లో కేసులు పరిష్కారం చేసుకుంటే విలువైన సమయంతో పాటు డబ్బు ఆదా ఉంటుందని తెలిపారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గంటి గోపాలకృష్ణ శర్మ, న్యాయవాదులు టీ పాణిగ్రహి, చందాన సూర్యనా రాయణ, కుమార్, అలజంగి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ స్థాయిలో కొత్తవలస రైల్వే స్టేషన్ అభివృద్ధి చేస్తాం

కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్

విశాలాంధ్ర-వేపాడ: కొత్తవలస రైల్వే స్టేషన్ ను ప్రపంచ స్థాయిలో ఉండే విధంగా అభివృద్ధి చేస్తామని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్ వెల్లడించారు.మండలంలోని వీలుపర్తి పంచాయతీలో శనివారం మండల ప్రత్యేక అధికారి లక్ష్మీనారాయణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర మంత్రి అశ్విన్ వైష్ణవ్ మాట్లాడుతూ కొత్తవలస రైల్వే స్టేషన్ ను ప్రపంచ స్థాయిలో నిలిచే విధంగా అభివృద్ధి చేయడం జరుగుతుందని అలాగే అందరి కృషి సహకారంతో భారత దేశాన్ని అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ప్రధాని నరేంద్ర మోడీ అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. అలాగే ఎస్ కోట రైల్వేస్టేషన్లో కిరండోల్ ఎక్స్ప్రెస్, కాశీకి వెళ్లేందుకు బెనారస్ ఎక్స్ప్రెస్ రైళ్లు ఆగే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే ప్రతి ఏటా రైల్వే అభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రూ.8 వేల కోట్లు విడుదల చేస్తున్నామన్నారు.అలాగే ప్రతి గ్రామంలో జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా ప్రతి ఇంటికి కులాయి కలెక్షన్ ద్వారా మంచి నీటిని అందించడం జరుగుతుందన్నారు. అలాగే రానున్న రోజుల్లో ఇదే స్ఫూర్తితో మరికొన్ని పథకాలను ప్రధానమంత్రి మోడీ అమలు చేసి దేశ ప్రజల ఉన్నత భవిష్యత్తుకు బాటల వేసి సుసంపన్నమైన దేశంగా తీర్చిదిద్దుతారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపముఖ్య మంత్రి జిల్లా ఇన్చార్జి మంత్రి బూడి ముత్యాల నాయుడు,రాజ్యసభ సభ్యులు జీవీఎల్ నరసింహారావు, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ఎన్ మాధవ్, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, స్థానిక ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, డిసిసిబి చైర్మన్ వివి చిన రాము నాయుడు,జిల్లా కలెక్టర్ ఏ.నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్,డి ఎల్ డిఓ నిర్మలాదేవి, ఆర్డీఓ సూర్యకళ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖా ధికారి ఎస్ భాస్కరరావు, ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ అప్పలరాజు, ఆర్ డబ్ల్యూ ఎస్ సూపరెండెంట్ ఇంజనీర్ ఉమా శంకర్,మండల తహసిల్దార్ ప్రసన్న కుమార్, ఎంపీడీఓ పట్నాయక్ లతో పాటు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన ఎంఈఓ లు

విశాలాంధ్ర-గజపతినగరం: మండలంలోని తమ్మారాయుడిపేట గ్రామంలో గల ప్రాథమిక పాఠశాలను మండల విద్యాశాఖ అధికారులు విమలమ్మ సాయి చక్రధర్ లు శనివారం సందర్శించారు ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించడంతో పాటు పిల్లల అభ్యసన స్థాయిని పరిశీలించారు అలాగే మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు సిబ్బందికి వాళ్ళ సూచనలు చేశారు ఈ సందర్భనలో ప్రధానోపాధ్యాయులు కనకల చంద్రరావు సీఆర్పి రెడ్డి పాల్గొన్నారు.

కొత్తవలస రైల్వే స్టేషన్ లో గుంటూరు-రాయగడ ఎక్స్‌ప్రెస్ ఆపాలి

కేంద్ర రైల్వే మంత్రి అశ్విన్ వైష్ణవకు సీపీఐ వినతి అందజేత

విశాలాంధ్ర-వేపాడ : కొత్తవలస రైల్వే స్టేషన్ వద్ద గుంటూరు, రాయగడ, సమతా, ప్రశాంత్, కోర్థ ఇంటర్సిటీ ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలిపి ప్రయాణికులను ఎక్కించే విధంగా చర్యలు చేపట్టాలని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్ కు శృంగవరపుకోట సిపిఐ కార్యదర్శి దేగల అప్పలరాజు వినతిపత్రం అందించారు. మండలంలోని వీలుపర్తీ గ్రామంలో శనివారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయనకు వినతిపత్రం అందించారు. విశాఖ జిల్లా పెందుర్తి కోటపాడు దేవరాపల్లి మండలాలతో పాటు విజయనగరం జిల్లా కొత్తవలస ఎల్కోట వేపాడ,ఎస్. కోట జామి మండలాల ప్రజలు నిత్యం వందల మంది విశాఖపట్నం విజయనగరం బొబ్బిలి పార్వతీపురం, ఇతర ప్రాంతాలకు కొత్తవలస మండల కేంద్రంలో ఉన్న రైల్వే స్టేషన్ నుండి ఉద్యోగరీత్యా చదువుల రీత్యా కూలీపనుల కు ఎక్కువమంది ప్రయాణం చేస్తున్నారని, ఇతర రాష్ట్రాలకు వెళ్లి వచ్చేవారు కూడా గుంటూరు, రాయగడ,సమత ప్రశాంత్ కోర్థ ఇంటర్సిటీ ఎక్స్‌ప్రెస్ రైలు, కొత్తవలస రైల్వేస్టేషన్‌లో నిలుపుదల చేయక ఇబ్బందులకు గురవుతున్నారని, అలాగే ఇతర రాష్ట్రాలకు వెళ్లి వచ్చేవారు రైలు నిలపకపోవడంతోలగేజీలతో తీవ్ర ఇబ్బందలు పడుతున్నారని, ఆయా రైళ్లను ఆపే విధంగా చర్యలు తీసుకోవాలని వినతిలో కోరారు.

జాతీయస్థాయి సైన్స్ కాంగ్రెస్ పోటీలకు ధర్మవరం విద్యార్థి ఎంపిక

విశాలాంధ్ర-శృంగవరపుకోట : జాతీయస్థాయి 31వ బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీలకు ఎస్.కోట మండలం, ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫ్లస్ విద్యార్థి బోజంకి భారత్, బొబ్బిలి గాయత్రి రూపొందించిన టిసిఎస్ - టీ కాఫీ శాండ్ ప్రాజెక్టు ఎంపికైనది. గుంటూరులోని కే.ఎల్ యూనివర్సిటీలో గురువారం నిర్వహించిన రాష్ట్రస్థాయి బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీలలో 187 ప్రాజెక్టులు ప్రదర్శించగా భరత్ రూపొందించిన టీ కాఫీ శాండ్ జాతీయ స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.మహేశ్వరరావు శనివారం తెలియజేసారు. గైడ్ టీచరుగా పొట్నూరు శివాజీ వ్యవహరించారు. ఈ విద్యార్థిని ఆప్ కాన్ట్ మెంబర్ సెక్రటరీ అపర్ణ, ఎస్సీ ఇఆర్టి డైరెక్టర్ బి.ప్రతా పరెడ్డి, డిఈఓ బి.లింగేశ్వర్ రెడ్డి, జిల్లా అకాడమిక్ కోఆర్డినేటర్ టి.రాజేష్, ఇన్చార్జి ప్రధాన ఉపాధ్యాయులు శివరామకృష్ణ, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

గుర్తుతెలియని వాహనం ఢీ వ్యక్తి మృతి

విశాలాంధ్ర-మెరకముడిదాం : మండలంలో గల ఉత్తరావల్లి జంక్షన్ నుండి బాడంగి వెళ్లే రూటులో గుర్తు తెలియని వాహనం ఢీ కొని ముగడ గ్రామానికి చెందిన పసగడ ముగదమ్మ(73) అనే వ్యక్తి శనివారం నాడు మృతి చెందినట్లు బుధరాయవలస ఎస్ ఐ సిహెచ్ నవీన్ పడాల్ తెలిపారు. మృతి చెందిన వ్యక్తి పద్మశాలి కుటుంబానికి చెందిన వారని అన్నారు. మరణించిన ముగధమ్మ మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాడంగి సి హెచ్ సి కి తరలించినట్లు తెలిపారు. మృతుడు కుటుంబీకులు పసగడ రామారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రమాదపు కేసు క్రింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ ఐ తెలిపారు.

రాష్ట్రంలో 3వేల మంది కౌలు రైతులు ఆత్మహత్యలు : నాదేండ్ల మనోహర్

విశాలాంధ్ర-భోగాపురం: వైసిపి ప్రభుత్వ హయాంలో ప్రస్తుతం రాష్ట్రంలో మూడు వేల మంది కౌలు రైతులు ఆత్మహత్య చేసుకున్నారని జనసేన పిఏసి చైర్మన్ నాదెండ్ల మనోహర్ అన్నారు. విజయనగరం జిల్లా భోగాపురంలో జనసేన నాయకురాలు లోకం మాధవి నూతనంగా నిర్మించిన జనసేన పార్టీ కార్యాలయాన్ని శనివారం సాయంత్రం అయన ప్రారంభోత్సవం చేశారు. ప్రస్తుత ప్రభుత్వం రాజ్యాంగాన్ని ఉల్లంఘించి గ్రామ పంచాయతీలను నిర్వీర్యం చేసి గొంతు కోసిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు ఇచ్చిన 3359 కోట్లు జగన్మోహన్ రెడ్డి గ్రామా పంచాయతీ లకు ఇవ్వకుండా అన్యాయం చేసారని విమర్శించారు. ఉత్తరాంధ్ర నుంచి ఎన్నికయిన నాయకులు ఉత్తరాంధ్రను అభివృద్ధి చేయకుండా తాము అభివృద్ధి చెందారని దుయ్యబట్టారు.విజయనగరం జిల్లాలో గుంకలాం హౌసింగ్ కాలనీ అంతా అవినీతిమయమేనని అన్నారు. 3 తరగతి పిల్లలకు 'టోఫెల్' పరీక్షకు శిక్షణ ఇస్తున్నామని చెపుతున్న వైసిపి కు సిగ్గులేదని అన్నారు. రానున్న ఎన్నికలలో తెలుగుదేశం తో కలసి ఎలాంటి అరమరికలు లేకుండా పనిచేసి వైసిపిను రాష్ట్రము నుంచి పంపించాలని అన్నారు. అనంతరం లోకం మాధవి మాట్లాడుతూ 4 సంవత్సరాలు దాటినా శంకుస్థాపనలు తప్ప విమానాశ్రయం ఇప్పటికీ నిర్మించలేకపోయారని అన్నారు. జట్టీలు లేక మత్యకారులు వలసలు పోయితున్నారని, జట్టీలు నిర్మిస్తామని వైసిపి ప్రభుత్వ నాయకులు ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. రానున్న కాలంలో జనసేనకు అధికారం వస్తే నెల్లిమర్ల నియోజకవర్గాన్నిహైదరాబాద్ లా అభివృద్ధి చేస్తామన్నారు. ఈ సారి అందరు జనసేన పార్టీకి సహకరించి అపూర్వ విజయం అందించాలని అన్నారు. అలాగే వివిధ ప్రమాదాలలో చనిపోయిన 4 గురు జనసేన కార్యకర్తలకు 5 లక్షలు, అంగవైకల్యం పొందిన ఇద్దరుకు 3 లక్షలు జనసేన ప్రమాద బీమా చెక్కులను అందించారు ఈ కార్యక్రమంలో జనసేన నాయకురాలు పడాల అరుణ, పాలవలస యశస్విని, జనసేన పార్టీ కార్యవర్గ సభ్యులు, మండల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఎస్బీఐ స్వయం ఉపాధి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-నెల్లిమర్ల: స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ అందిస్తున్న ఉపాధి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కో ఆర్డినేటర్ వై వర్మ కోరారు. నెల్లిమర్ల వెలుగు భవనంలో నిరుద్యోగ యవతలకు జ్యూట్ ప్రొడక్ట్స్ పై శనివారం శిక్షణ అందించారు. ఈ సందర్భంగా ట్రయినర్ ఎస్ రమేష్ శిక్షణ ఇస్తున్నారు. ఈ సందర్భంగా కోఆర్డినేటర్ వర్మ మాట్లాడుతూ 13 రోజులు పాటు ఈ శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. శిక్షణ పొందిన వారికి ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పించనున్నట్లు చెప్పారు. శిక్షణ అనంతరం అభ్యర్థులకు బ్యాంకు ద్వారా రుణం మంజూరు చేయనున్నట్లు చెప్పారు. ఉచిత కోర్సు మెటీరియల్ అందజేయనున్నట్లు చెప్పారు. శిక్షణకు అభ్యర్థులు జిల్లాకు చెందిన వారై ఉండాలి, కనీస విద్యార్హత పదోతరగతి ఉత్తీర్ణత, ఫెయిలైన వారు కూడా అర్హులని చెప్పారు.

నేడు ఉచిత ఉచిత కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర-సీతానగరం: స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నేడు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు వైద్యులు ఉషా రాణి, పావనిలు తెలిపారు. డాక్టర్ వైయస్సార్ కంటి వెలుగు పథకం ద్వారా అవ్వతాతలకు వెలుగు నివ్వడానికి శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి విశాఖపట్నం ఆధ్వర్యంలో, జిల్లా అందత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఈకార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు ఈ శిబిరంలో అన్నికంటి వ్యాధులకు ఉచితంగా కంటి పరీక్షలు జరపబడునని తెలిపారు. శుక్లము ఆపరేషన్ కు ఎంపికైన నిరుపేదలకు డాక్టర్ సలహా మేరకు కాటరాక్ట్ శస్త్ర చికిత్స అమర్చి ఉచితంగా ఆపరేషన్ చేయబడునని తెలిపారు. కంటిమీద కండ్ల, మెల్లకన్ను సరిచేయుట, మరియు కంటి శుక్లాలు ఉన్న పెద్దలకు, పిల్లలకు ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితముగా ఆపరేషన్ చేయబడునని తెలిపారు. ఈ శిబిరానికి వచ్చేవారు తప్పనిసరిగా వారియొక్క ఆధార్ కార్డు లేదా ఆరోగ్యశ్రీ కార్డు తీసుకొని రావాలని వారు తెలియజేశారు. మరిన్ని వివరములకు స్థానిక ప్రాదమిక ఆరోగ్య కేంద్రం సిహెచ్ఓ ఎస్ .వెంకటరమణను లేదా సహాయస్ఫూర్తి ఫౌండేషన్ కు చెందిన సాయికుమార్ ను లేదా క్యాంప్ సూపర్వైజర్ వెంకటరమణ లను సంప్రదించాలని వారు తెలిపారు. ఈకార్యక్రమాన్ని మండలంలోని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఉద్యోగుల కూడా వారి హెల్త్ కార్డులు ద్వారా దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అరకు పార్లమెంట్ అధ్యక్షులు కిడారి శ్రావణ్ కుమార్ ను కలిసిన టీడీపీ నాయకులు



విశాలాంధ్ర-పార్వతీపురం: అరకు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులుగా కొత్తగా నియమించబడిన మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ ను మాజీ అధ్యక్షులు, టీడీపీ పోలిట్ బ్యూరో సభ్యులు గుమ్మడి సంధ్యారాణి,నియోజక వర్గ టీడీపీ ఇంఛార్జి బోనెల విజయ చంద్రలు కలిసి దుశ్శాలువాను కప్పి బొకేనుఅందజేసి అభినందనలు తెలిపారు.వారితోపాటు సీనియర్ నాయకులు గొట్టాపు వెంకటనాయుడు, బార్నాల సీతారాం,కోరాడ నారాయణ రావు తదితరులు కలిసి అభినందనలు తెలిపారు. వారితో పాటు జిల్లాలోని పాలకొండ నియోజక వర్గం ఇంచార్జి నిమ్మక జయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.నియోజక వర్గంలో పార్టీ బలోపేతం చేయడానికి కష్టపడి పనిచేయాలని శ్రావణ్ కుమార్ పిలుపు నిచ్చారు.

36 గంటల ధర్నాను జయప్రదం చేయండి : సిటూ

విశాలాంధ్ర-కొమరాడ: వాకాడ ఇందిరా ఈనెల 14 15 తేదీల్లో ఆశా వర్కర్లు కమ్యూ నిటీ హెల్త్ వర్కర్లు సమస్యలపై కలెక్టర్ కార్యాలయం వద్ద 36 గంటలు ధర్నా నిర్వహిస్తామని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు వాకాడ ఇందిరా శనివారం పత్రిక విలేకరులతో మాట్లాడుతూ మండలంలో గల కొమరాడమండల కేంద్రంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్యంతో పాటు కూనేరూ రామభద్రపురం మాదలింగి ప్రాథమిక కేంద్రాల్లో పని చేయుచున్న ఆశావర్కర్లు, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు సంబంధించి కనీస వేతనం 26వేలు ఇవ్వాలని ఉద్యోగ భద్రత కల్పించాలని రాజకీయ వేధింపుల ఆపాలని సంక్షేమ పథకాలు అమలుచేయాలని ఉద్యోగ భద్రత కల్పించాలని టిఏ డిఏ లు ఇవ్వాలని అలాగే కరోనా వైరస్ వ్యాప్తి చెందే సందర్భంలో ఆశ వర్కర్లు, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు మరణించిన కుటుంబాలకు రూ.50 లక్షలు ఇంటికి ఒక ఉద్యోగం ఇవ్వా లని సంక్షేమ పథకాలు అమలుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల సిటూ నాయకులు కొల్లి సాంబమూర్తి, ఆశావర్కర్ల యూనియన్ నాయకులు రాజేశ్వరి కమ్యూనిటీ హెల్త్ వర్కర్ యూనియన్ నాయకురాలు దుర్గమ్మ ఆశా కార్యకర్తలు సిహెచ్డబ్ల్యులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్ ద్వారా 22కేసులు పరిష్కారం

ఎస్ఐ ఎం రాజేష్

విశాలాంధ్ర-సీతానగరం: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం జరిగిన మెగా లోక్ అదాలత్ కార్యక్రమం ద్వారా 22సివిల్,క్రిమినల్ తదితర కేసులను పరిష్కారం చేయడం జరిగిందని ఎస్ఐ ఎం రాజేష్ తెలిపారు. సిబ్బంది చొరవ, కక్షదారుల సహకారంతో పరిష్కారం చేయడం జరిగిందని తెలిపారు.2024సాధారణ ఎన్నికల దృష్ట్యా గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.మండలంలో రాష్ట్రీయ రహదారి ఎక్కువఉండటంతో రోడ్డు ప్రమాదాలు జరగకుండా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.వాహనదారులు కూడా రోడ్డు ప్రమాదాలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన సెక్టోరియల్ అధికారులు

విశాలాంధ్ర-సీతానగరం:మండలంలోని వెంకటపురం, బూర్జ, కృష్ణరాయపురం గ్రామాల్లోని 122, 124, 125, 126, 127, 128 పోలింగ్ కేంద్రాలను సెక్టోరియల్ అధికారులైన ఈఓపిఆర్డీ కుమార్ వర్మ, నరసింహులు కలిసి శనివారం పరిశీలించారు. జిల్లా రెవెన్యూ అధికారి ఆదేశాలు మేరకు ఆయాపోలింగు బూతుల పరిదిలో మౌలిక సదుపాయాలు పరిశీలించి వాటిపై జిల్లా రెవెన్యూ అధికారికి నివేదిక అందజేస్తామని తెలిపారు. వారితోపాటు ఆయాగ్రామాల బి ఎల్ఓ లు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సర్పంచులు బుడితిశ్రీనివాసరావు, గుజ్జల దాసు, గునుపూరు అన్నంనాయుడులు పాల్గొన్నారు.

హైరిస్క్ గర్భిణీలను గుర్తించాలి

విశాలాంధ్ర-బెలగాం: హైరిస్క్ గర్భిణీలను గుర్తించాలని జిల్లా హెల్త్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్మోహనరావు సూచించారు. ఈ మేరకు ఆయన సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణీల ఆరోగ్య తనిఖీల కొరకు నిర్వహించిన ప్రదాన్ మంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ (పిఎంఎస్ఎంఎ) కార్యక్రమాన్ని శనివారం తనిఖీ చేశారు. ఆసుపత్రిలో గర్భిణీలకు నిర్వహించిన వైద్య పరీక్షలను పరిశీలించారు. మాతా, శిశు సంరక్షణ కార్డులో నమోదు చేసిన ఆరోగ్య వివరాలు పరిశీలించి, వైద్య పరీక్షల నివేదికలు అసాధారణంగా ఉన్న గర్భిణీలను హైరిస్క్ గా గుర్తించాలని, వీరికి తగు చికిత్స అందజేసి పూర్తి స్థాయి ఆరోగ్య పర్యవేక్షణ ఉండాలని స్పష్టం చేశారు. రక్తహీనత హైరిస్క్ గా గుర్తించిన గర్భిణీలు ఎంతమంది ఉన్నారని ఆరా తీసారు. అదేవిధంగా ప్రతీ ఐరన్, కాల్షియం మాత్రలు నిర్దేశించిన మోతాదులో వేస్తున్నదీ, లేనిదీ ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. టిడి వ్యాక్సిన్ రెండు డోసులు నెల వ్యవధిలో గర్భిణీలందరికీ వేయాలన్నారు. కాన్పు సమయం దగ్గరగా ఉన్న గర్భిణీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. రక్తహీనతగా ఉన్న గర్భిణీలకు పిహెచ్సిలో ఐరన్ సుక్రోజ్ ఇంజెక్షన్లు ద్వారా చికిత్స కొరకు ఆసుపత్రికి చేర్చడానికి తల్లి-బిడ్డ ఎక్స్ ప్రెస్ వాహనం వినియోగించాలన్నారు. అనంతరం డాక్టర్ జగన్మోహనరావు అక్కడ గర్భిణీలతో మాట్లాడి వారికి గల ఆరోగ్య సమస్యలు తెలుసుకొని తీసుకోవాల్సిన జాగ్రతలు వివరించారు. పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ఉషారాణి, ఎస్.హెచ్.ఓ ఎస్వీ రమణ, సూపర్ వైజర్ భవాని, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

నారీశక్తి అవార్డు గ్రహీత భూదేవి కి గణ సన్మానం



విశాలాంధ్ర-సీతంపేట: ఆనంద మయి ఆడిటోరియంలో శనివారం నిర్వహించిన నారీశక్తి సమ్మేళనం కార్యక్రమానికి నారీశక్తి అవార్డు గ్రహీత పడాల భూదేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూదేవి మాట్లాడుతూ మారుమూల గిరిజన ప్రాంతం నుంచి రాష్ట్రపతి అవార్డు అందుకునె స్థాయికి చేరుకోవడం గర్వకారణంగా ఉందన్నారు. అయితే అవార్డు లభించడం వెనక చాలామంది సపోర్ట్ ఉందన్నారు. ఇప్పటికే మహిళా భ్యున్నత కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. అలాగే సమాజంలో మహిళ పాత్ర కీలకమన్నారు.మెరుగైన సమాజం కోసం తల్లి తన పిల్లలను క్రమశిక్షణ తో విద్యను అభ్యసించేలా చూడాలని అన్నారు. ముందుగా భూదేవికి జ్ఞాపిక అందజేసి సావధానంగా అహ్వానించారు.

భయం భయంగా చదువులు... ఊడి పడుతున్న పైకప్పు పెచ్చులు...

విశాలాంధ్ర-కురుపాం: దేవుడు వరమిచ్చిన పూజారి అడ్డుకున్న చందంగా... ఆ ఊరికి మొన్నటి దాకా శాశ్వత రహదారి లేక పోవడంతో స్థానిక మండల పరిషత్ పాఠశాల లో నాడు.. నేడు పనులకు నోచుకోలేదు. దశాబ్దాల క్రితం పాఠశాల భవనం కావడంతో ప్రస్తుతం పెచ్చులు ఊడి పడుతున్న కారణంగా మండలంలోని గొటివాడ పంచాయతీ బల్లుకోట మండల పరిషత్ పాఠశాల విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ భయపడుతూ చదువుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం గతంలో నాడు-నేడు మొదటి దఫాలో నిధులు మంజూరు అయినప్పటికీ ఆ గ్రామానికి రహదారి సౌకర్యం లేక పనులు చేపట్టలేక పోయారు. ఫలితంగా నిధులు వెనక్కిమళ్లాయి. స్థానిక ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి చొరవ తో ఇటీవల నూతనంగా బల్లుకోట కు బి.టి రహదారి నిర్మాణం చేసి దీర్ఘకాలిక సమస్యకు పరిష్కారం చేశారు. విద్యాశాఖ అధికారులు తక్షణమే స్పందించి శిథిల పాఠశాల భవనస్థానంలో నూతన భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని తల్లి తండ్రులు కోరుతున్నారు.

మహిళల ఆర్థిక పరిపుష్టికి ప్రభుత్వం ఊతం: కలెక్టర్ నిశాంత్‌కుమార్

విశాలాంధ్ర-పార్వతీపురం: మహిళలు అన్ని రంగాల్లో రాణించి ఆర్థిక పరిపుష్టి సాధించే విధంగా ప్రభుత్వం ఊతం అందిస్తుందని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. స్థానిక కలెక్టర్ కార్యాలయ ఆవరణలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉన్నతి మహిళా శక్తి పథకం క్రింద మహిళలకు జిల్లా కలెక్టర్ శనివారం ఆటోలను పంపిణీ చేశారు. అనంతరం జండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా మహిళలు ఆత్మస్థైర్యంతో అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలన్న ఉన్నతమైన ఆశయంతో ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. ఆటో నడుపుకొని వచ్చిన ఆదాయంతో జీవన ప్రమాణాలను పెంపొందించుకోవాలని సూచించారు. స్వయం శక్తి సంఘాల్లోని అర్హత కలిగిన షెడ్యూల్ తెగలు, కులాలకు చెందిన మహిళలకు ఉన్నతి పథకం ద్వారా వడ్డీ లేని రుణాలతో ఆటోలను పంపించేస్తున్నామన్నారు. జిల్లాకు 8 ఆటోలు మంజూరు కాగా ప్రస్తుతం ఐదు ఆటోలు లబ్ధిదారులకు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. లబ్ధిదారులకు రూ.3 లక్షలు వరకు వడ్డీలేని రుణాలు అందజేస్తున్నామన్నారు. ఒక్కో లబ్ధిదారులు పది శాతం వాటాను మూల ధనంగా పెట్టుబడిపెట్టి నెలసరి వాయిదా క్రింద రూ.6,200లు చెల్లించవలసి ఉంటుందని వివరించారు. మహిళలు ఈ అవకాశాన్ని చక్కగా సద్వినియోగం చేసుకోవాలని, కుటుంబాలు ఆర్థిక స్వావలంబన సాధించే విధంగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.కిరణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయం లోక్ అదాలత్ లో 1759 కేసులు పరిష్కారం

సీనియర్ సివిల్ జడ్జి యజ్ఞ నారాయణ

విశాలాంధ్ర-బెలగాం: కేసుల సత్వర పరిష్కారానికి రాజీమార్గం అనుసరించడమే ఉత్తమ మార్గమని పార్వతీపురం సీనియర్ సివిల్ జడ్జి జి. యజ్ఞ నారాయణ అన్నారు. శనివారం పార్వతీపురం కోర్టులో జాతీయ లోక్ అదాలత్ ను నిర్వహించారు. ఈ జాతీయ లోక్ అదాలత్ లో 1759 కేసులు పరిష్కారమయ్యాయి. వీటిలో ఐపిసికేసులు 66, సివిల్ కేసులు 15, ఎక్సైజ్ కేసులు 21, ఎన్ఐయాక్టు కేసులు 7, ఫ్యామిలీ కేసులు 6, ఎస్.టి.సి కేసులు 1541, ఫైన్ కు సంబంధించిన కేసులు 103 మొత్తం 1759 కేసులుగా రాజీ పరిష్కారం చేయడం జరిగింది. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి జి. యజ్ఞనారాయణ మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న కేసులు త్వరితగతిన పరిష్కరించుకునే విధంగా జాతీయ లోక్ అదాలత్ ఏర్పాటు చేయడమైనదని ఇటువంటి అవకాశం కల్పించడం వలన కక్షిదారులకు సమయంతో పాటు డబ్బు ఆదా చేసుకుని సత్వర న్యాయం పొందవచ్చని అన్నారు. కేసులు తీవ్రతను బట్టి రెగ్యులర్ కోర్టులో వ్యాజ్యం నడిపించవలని వచ్చినట్లయితే తగు సలహా ఇవ్వడమే కాక అర్హులైన పేదవారికి ప్రభుత్వం తరపున ఉచితంగా న్యాయవాదిని నియమించటం జరుగుతుందన్నారు. జాతీయ లోక్ అదాలత్ లో కేసుల పరిష్కారం నిమిత్తం మూడు బెంచ్ లను ఏర్పాటు చేశారు. మొదటి బెంచ్ కు సీనియర్ సివిల్ జడ్జి జి. యజ్ఞనారాయణ, రెండవ బెంచ్ కు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ. రమేష్, మూడవ బెంచ్ కు అడిషనల్ జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ డి. సౌజన్యను నియమించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు నల్ల శ్రీనివాసరావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ చంద్ర కుమార్, సీనియర్ న్యాయవాదులు, పోలీసు అధికారులు, కక్షిదారులు పాల్గొన్నారు.

నైతిక విలువలే ప్రజాస్వామ్యానికి రక్ష : భీశెట్టి బాబ్జీ

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : నైతిక విలువలే ప్రజాస్వామ్యానికి రక్ష అని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు భీశెట్టి బాబ్జీ అన్నారు. అవినీతి నిరోధక దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం జిల్లా అధ్యక్షులు సముద్రాల గురుప్రసాద్ ఆధ్వర్యంలో గురజాడ విద్యాసంస్థలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ ప్రజాస్వామ్యం, ప్రజాస్వామ్య వ్యవస్థ లను అవినీతి తినేస్తుందని, రాజ్యాంగం ఎంత బాగున్నా అది అమలు చేసే వారు చెడ్డవారైతే ఫలితాలు చెడుగా, చేదుగా ఉంటాయని అన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు గురుప్రసాద్ మాట్లాడుతూ దేశంలో ఏ మూల చూసినా అవినీతి పరంపరే అని, ఈ వ్యవస్థను మార్చాలంటే దాని మూలాలు నుండి మార్పు తీసుకురావాలని విలువలతో కూడిన వ్యవస్థ ఆవిర్భవించాలని అన్నారు. జవాబుదారీతనంతోనే అవినీతిని అంతం చేయవచ్చని, అవినీతి భూతం అభివృద్ధికి శరాఘాతంగా పరిణమించిందని అన్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు నైతిక విలువలు అనే అంశంపై నిర్వహించిన వక్తృత్వ పోటీలలో విజేతలుగా నిలిచిన జి షర్మిల, కె లక్ష్మీ శ్రావణి,జి.కౌశల్యకు బహుమతులు, పతకాలు ప్రదానం చేసారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు పూడి శేఖర్, ఎ ఎస్ నాయుడు, లత పాల్గొన్నారు.

గర్భిణుల ఆకలితీర్చడం దాతల అదృష్టంగా భావించాలి

వైద్యాధికారి డా.సామ్రాజ్యలక్ష్మి

విశాలాంధ్ర-జామి: వైద్య తనిఖీలకు వచ్చే గర్భిణీలకు,వ ఆరి సహాయకులు ఆకలితో ఉండకుండా వారికి భోజన ఏర్పాట్లు చేయడం ఎంతో ఆనందదాయకమైన విషయమని జామి పిహెచ్‌సి వైద్యాధికారిణి డా. ఆర్. సామ్రాజ్యలక్ష్మి అన్నారు. శనివారం ఆసుపత్రిలో నెలవారీ తనిఖీలను గర్భిణీలకు నిర్వహించారు. మధ్యాహ్నం జామికి చెందిన కటకం వీరభద్రస్వామి(స్వామిఆర్ట్స్ చిన్ని), పార్వతి దంపతుల అల్లుడు,కుమార్తెలు పాలవలస కిరణ్‌కుమార్,జితేంద్ర కళ్యాణిలు వారి కుమార్తె జస్వత్రి పేరున ఈభోజన ఏర్పాట్లు చేసారు. ఈకార్యక్రమాన్ని వైద్యాధికారిణి ప్రారంభించి దాదాపు వందకు పైగా గర్భిణీలకు, వారి సహాయకులకు, ఆసుపత్రి సిబ్బంది, ఆశాలకు భోజనాన్ని అందించారు. ఇటువంటి కార్యక్రమాలను చేసేందుకు ఎంతో అదృష్టంగా భావించాలని వైద్యాధికారి అన్నారు. ప్రతి ఒక్కరు మరొకరి ఆకలి తీర్చడం ఎంతో సుకృతం అన్నారు. ఈకార్యక్రమంలో ప్రముఖ సంఘ సేవకుడు నార్లమహంతి నారాయణరావు, కిశోర్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

టీ.బి వ్యాధిగ్రస్తులకు నిత్యావసర సరుకులు పంపిణీ

విశాలాంధ్ర-వేపాడ : మండలంలోని బొద్దాం పీహెచ్సి పరిధిలో 4గురు టీ.బి (క్షయ) వ్యాధు గ్రాస్తులకు క్షయమిత్ర సోంపురం ఎంపీటీసీ ఆకుల సత్యనారాయణ ఆర్థిక సహాయంతో సమకూర్చిన నిత్యవసర సరుకులను సోంపురం సర్పంచు మురిపిండి గంగరాజు, తొండ వరపు మల్లేశ్వర రావు చేతుల మీదుగా అందించారు, వీలుపర్తి గ్రామంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో 4గురు క్షయ వ్యాధిగ్రస్తులకు 2 నెలలకు సరిపడా పౌష్టికాహారం కొరకు కంది పప్పు పెసరపప్పు సోడిపిండి నూనె బెల్లం, శనగ చెక్కిలు, ఖర్జురం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్షయ వ్యాధి కంట్రోల్ అధికారి బొద్దాం పిహెచ్సి వైద్యాధికారి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

13న మండల సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర గజపతినగరం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బెల్లాన జ్ఞాన దీపిక అధ్యక్షతన ఈనెల 13న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించినట్లు ఎంపీడీవో కార్యాలయ పరిపాలన అధికారి సుదర్శన్ విలేకరులకు తెలిపారు ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు మండల పరిషత్ సభ్యులు హాజరు కావాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయంతో లాభాలు..

కెఎఫ్డబ్ల్యు టీమ్ సభ్యులు సంజయ్ గుప్తా, జలాల్

విశాలాంధ్ర-శృంగవరపుకోట: ప్రకృతి వ్యవసాయంతో తక్కువ పెట్టుబడులతో ఎక్కువ లాభాలు గడించవచ్చని కెఎఫ్డబ్ల్యు టీమ్ సంజయ్ గుప్తా, జలాల్ గుర్తు చేశారు. ఎస్.కోట మండలంలోని వినాయకపల్లి గ్రామంలో కెఎఫ్డబ్ల్యు టీమ్ సభ్యులు గుప్తా, జలాల్, ఆర్టీఎల్ హేమసుందర్, ఆర్టీఓ ప్రకాష్, డీపీఎం ఆనంద్ తదితరులు శనివారం పర్యటించారు. ప్రకృతి వ్యవసాయం చేయడంవల్ల లాభాలు గురించి రైతులతో సమావేశం ఏర్పాటు చేసి అనుభవాలు తెలుసుకున్నారు.

గర్భిణులకు నెలనెలా ఆరోగ్య తనిఖీలు చేయాలి

జామి పిహెచ్‌సి వైద్యాధికారిణి డా.సామ్రాజ్యలక్ష్మి

విశాలాంధ్ర-జామి: గర్భిణీలు క్రమం తప్పకుండా ఆరోగ్య తనిఖీలు చేయించు కున్నట్లయితే, సుఖవంతమైన ప్రసవాలకు మార్గం ఏర్పడుతుందని వైద్యాధికారి డా.ఆర్.సామ్రా జ్యలక్ష్మి అన్నారు. శనివారం ఉదయం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం జామిలో,ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ కార్యక్రమములో భాగంగా, గర్భిణీలకు ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ,గర్భిణీలు మంచి పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు ఆరోగ్యతనిఖీలు క్రమం తప్పకుండా చేయిం చుకోవాలని అన్నారు. అత్యంతప్రమాదకర గర్భిణీలను ముందుగా గుర్తిస్తే,సుఖవంతమైన ప్రసవానికి కావలసిన చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉంటుందని అన్నారు. క్షేత్రస్థాయిలో గర్భిణీలను గుర్తించిన వెంటనే, టి.డి.టీకా మొదలుకొని, రక్తపోటు, మధుమేహం, రక్తహీనత వంటి రక్తపరీక్షలతోపాటు, ఆరోగ్యతనిఖీలు చేయించడం జరుగుతుందన్నారు. కార్యక్రమములో హెల్త్‌ఎడ్యుకేటర్ ఎస్.అనిల్ ప్రేమకుమార్, సి.హెచ్.ఓ.ఫ్లోరెన్స్, హెచ్.వి.భవాని, ఎమ్.ఎల్. హెచ్.పి.లు,ఆశా కార్యకర్తలు,గర్భిణీలు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పాలనలో చిత్తశుద్ధితో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి..

కేంద్ర రైల్వే, టెలికం శాఖామంత్రి అశ్విని శ్రీవైష్ణవ్

విశాలాంధ్ర-వేపాడ: ప్రధాన మంత్రి నరేంద్రమోడీ సారథ్యంలో బీజేపీ పాలనలో చిత్తశుద్ధితో ఆంధ్రప్రదేశ్ ను అభివృద్ధి చేస్తున్నామని కేంద్ర రైల్వే, టెలికం శాఖామంత్రి అశ్విన్ శ్రీవైష్ణవ్ అన్నారు. మండలంలోని వీలుపర్తి గ్రామంలో శని వారం ఏర్పాటు చేసిన వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు.ఏపీ ప్రజలకోసం రైతు సంక్షేమం, ఆహార భద్రతకు భరోసా, గిరిజన సమాజాలకు గౌరవం, హక్కులు, అవకాశాలు, పేదల కోసం ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద పట్టణ, గ్రామీణ ప్రాంతాల పేదల కోసం సొంతఇంటి సాకారం చేసిన ఘనత ప్రధానమంత్రి మోడీకే దక్కిందన్నారు. అలాగే మహిళా సాధికారత కోసం ప్రధాన మంత్రి ఉజ్వల యోజనలో 5.12లక్షలమందికి ఉచిత ఎల్ పిజి గ్యాస్ కనెక్షన్లు, పిఎం ముద్రయోజనలో రుణాలు, సుకన్య సమృద్ధి యోజనలో బాలికల పేరిట ఖాతాలు, ఆయుష్మాన్ భారత్‌లో ప్రతి ఏటా ప్రతి కుటుంబానికి 5లక్షల విలువైన ఆరోగ్య బీమా రక్షణ, అణగారిన వర్గాలకు సామాజిక భద్రత పేరిట పీఎం జన్ ధన్ యోజన, పీఎం సురక్ష బీమా యోజన, పీఎం జీవన్ జ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, పీఎం స్వనిధి యోజన వంటి పథకాల ద్వారా కొట్లాదిమంది ప్రజలకు లబ్ధి చేకూర్చ దం జరిగిందన్నారు. అమృత్ భారత్ స్టేషన్ల పథకం కింద 72రైల్వే స్టేషన్ల ఆధునీకీకరణ భాగంగా రాష్ట్రంలో 4వందే భారత్ రైళ్ల నిర్వహణ, 96.05కోట్లతో విశాఖ అంతర్జాతీయ విహారనౌకా టెర్మినల్ నిర్మాణం చేపట్టామన్నారు.స్వదేశీ దర్శన్ పథకం కింద చారిత్రక ప్రదేశాల పునరుద్దరణ, అంకుర భారతం, సమృద్ధ భారతం వంటి అనేక పథకాలను ఏపీలో అమలు చేస్తూ అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నా మన్నారు. ఏపీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస్తూ రాష్ట్ర అభివృద్ధికి ఇతోధికంగా కృషిచేస్తున్నామన్నారు. కేంద్ర రైల్వే మంత్రి అశ్విని శ్రీవైష్ణవ్ వికసిత్ భారత్ సంకల్ప యాత్ర భాగంగా మన ప్రాంతానికి రావడం శుభపరిణామమన్నారు. శృంగవరపుకోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు మాట్లాడుతూ సీఎం జగన్ నా లుగున్నరేళ్ళ పాలనలో రాష్ట్ర అభివృద్ధికి సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకోవడం గమనార్హమన్నారు. కేంద్ర ప్రభుత్వంతో సీఎం సత్సంబంధాలు నెరిపి నిధులు రాబట్టడంలో విజయం సాధించారన్నారు. కాగా కేంద్రమంత్రి ముందు నేరుగా సమావేశ వేదిక ఆవరణలో ఏర్పాటు చేసిన 13రకాల స్టాల్స్ ను సందర్శించి ప్రసంశించారు. జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి సారథ్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు గంటన్నరపాటు పీఎం నరేంద్ర మోడీ ప్రసంగాన్ని ప్రజలకు వినిపించారు. ఈ కార్యక్రమంలో ఇంకా జేసీ మయూర్ అశోక్,జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, మాజీ ఎమ్మెల్సీ మాధవ్, డీసీసీబీ చైర్మన్ వేచలపు వెంకట చినరామునాయుడు, జడ్పీటీసీ ఎస్ అప్పారావు, ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు గ్రామ సర్పంచ్ శానాపతి లీల అప్పారావు జిల్లాలోని పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. కేంద్రమంత్రి అశ్విని శ్రీవైష్ణవ్ హిందీలో ప్రసంగించగా రాజ్యసభ సభ్యులు కేవిఎల్ ఎన్ నరసింహారావు తెలుగులో ప్రజలకు వివరించారు.మండల ప్రత్యేక అధికారి లక్ష్మీనారాయణ సభను నిర్వహించారు. మండలంలోని అనేక గ్రామాల నుంచి మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్ లో 45 కేసులు పరిష్కారం

విశాలాంధ్ర-శృంగవరపుకోట: శృంగవరపుకోట మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కుమారి సబ్బవరపు వాణి అధ్యక్షతన శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్ లో 28 క్రిమినల్, 8 సివిల్, 9 చెక్ బౌన్స్ మొత్తం 45 కేసులను పరిష్కరించారు. సివిల్ కేసులకు సంబం ధించి కేవలం ప్రామిసరి నోట్ కేసులనే కాకుండా దీర్ఘకాలికంగా పెండింగులో ఉండి పరిష్కరించాల్సిన భూమి తగాదాలను కూడా లోక్ అదాలత్ ద్వారా రాజీ పరిష్కారం చేసారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి వాణి మాట్లాడుతూ లోక్ అదాలత్ లను సద్వినియోగం చేసుకోవడం ద్వారా కేవలం ధనాన్ని మాత్రమే కాక కాలాన్ని కూడా ఆదా చేసుకోవచ్చునని వెల్లడించారు. సివిల్ తగాదాలలో వాది చెల్లించిన కోర్టు ఫీజులు తిరిగి పొందడానికి అవకాశం ఉందన్నారు. కార్యక్రమానికి అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.కేశవ, న్యాయ వాదుల సంఘం అధ్యక్షులు అల్లు సత్యాజి, కార్యదర్శి డబ్ల్యు.ఎన్. శర్మ, సీనియర్ న్యాయవాదులు జి.సూరిదేముడు, బి.త్రిమూర్తులు, మామిడి చంద్రశేఖర్, వారాది ఈశ్వరరావు, టీవీ రమణమూర్తి, బీవీఎస్ రామారావు, ఎం.అనూరాధ, సీహెచ్ఆర్‌పి నాయుడు, ఎం.అప్పారావు, జి.చిట్టిబాబు, ఆర్.సత్య నారాయణ, బి.వెంకటరావు, బి.సత్యనారాయణ, పోలీసులు, అధిక సంఖ్యలో కక్షిదారులు పాల్గొన్నారు.

ఘనంగా సోనియా గాంధీ పుట్టినరోజు వేడుకలు..

విశాలాంధ్ర-శృంగవరపుకోట : కాంగ్రెస్ పార్టీ అధినేత సోనియా గాంధీ పుట్టినరోజు వేడుకలు ఎస్.కోటలో శనివారం మండల పార్టీ ధ్యక్షుడు గడి బంగారు నాయుడు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఇటీవల జరిగిన ఎన్నికలలో తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అఖండ విజయం సాధించిందని, రానున్న ఎన్నికల్లో ఏపీ రాష్ట్రంలో కూడా కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని పార్టీ అధ్యక్షుడు బంగారు నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్టీ సెల్ కన్వీనర్ చీమల అచ్చిబాబు, సీనియర్ నాయకులు పదాల మణిబాబు, జామి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బోని అప్పారావు, కొత్తవలస కె.సన్యాసి పాత్రుడు, లకవరపుకోట జి.మోహనరావు, నాయకులు అప్పారావు, గోపి వాసుదేవ, రవి పాల్గొన్నారు.

వావిలపాడులో బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ

విశాలాంధ్ర-వేపాడ: మండలంలోని వావిలపాడు గ్రామంలో బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం శనివారం గ్రామ మాజీ ఉప సర్పంచ్ గుంటపల్లి దేముడు నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామంలో సాలిపేట, గొల్లపేట, ప్రతి ఇంటికి తిరిగి బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కరపత్రాలను వంచి అధికారంలోకి రాగానే మహిళలకు అందిస్తున్న పథకాలపై వివరించారు. కార్యక్రమంలో గ్రామ టిడిపి సీనియర్ నాయకులు గండి గోవిందనాయుడు, వేచలపు ముత్యాలనాయుడు, కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు.

పరిపాలన విధానంపై పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ

ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు

విశాలాంధ్ర-డెంకాడ: మండల కార్యాలయంలో సర్పంచులు ఎంపీటీసీ సభ్యులు ప్రజా ప్రతినిధులు సమన్వయం చేసుకొని గ్రామాల్లోని సమస్యలు పరిష్కరించుకోవాలని ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు సచివాలయ సిబ్బందికి సూచించారు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పరిపాలన విధానంపై పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తూ ఎప్పటికప్పుడు పరిష్కరించుకునేందుకు స్థానిక గ్రామ సభలు సాధారణ అత్యవసర ప్రత్యేక సమావేశాలు నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఈవో పిఆర్డి గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

బేబీనాయనను కలిసిన టీడీపీ ఇంచార్జి

విశాలాంధ్ర-పార్వతీపురం: బొబ్బిలి టీడీపీ నియోజక వర్గ ఇంచార్జి, మాజీ మున్సిపల్ చైర్మన్ బేబీనాయనను పార్వతీపురం టీడీపీ నియోజక వర్గ ఇంఛార్జి బోనెల విజయచంద్ర శనివారం సాయంత్రంకోటలో కలిసారు.రెండు నియోజకవర్గాలలో పార్టీ గూర్చి, ఇటీవల కాలంలో జరుగుతున్న పరిణామాలు గూర్చి కొద్దిసేపు ముచ్చటించారు.ఈకార్యక్రమంలో నాయకులు గొట్టాపు వెంకటనాయుడు గారు, పార్వతీపురం ఐటీడిపి కోఆర్డినేటర్ బార్నాల సీతారాంలు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సారధ్యంలోనే రాష్ట్రంలో సుపరిపాలన

ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

విశాలాంధ్ర-శృంగవరపుకోట : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సారధ్యంలోనే రాష్ట్రంలో సుపరిపాలన అందుతోందని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. 289వ రోజు 'గడప గడప కి మన ప్రభుత్వం' కార్యక్రమం ఎస్.కోట మండలం, ముషిడిపల్లి సచివాలయం పరిధిలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడుబండి ఇంటింటికి వెళ్లి అందిన సంక్షేమం, గ్రామాల్లో సమస్యలపై ఆరా తీశారు. తదుపరి సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టడం.. పరిష్కరించడం ఈ నాలుగు అంశాలు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలోని కీలక అంశాలని ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు గుర్తు చేశారు. ఈ సందర్భంగా ప్రతి గడపలోకి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించటం, ఇంకా ఏమైనా సమస్యలు వుంటే తెలుసుకొని అక్కడికి అక్కడే సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటూ, నేరుగా ప్రజలతో కలసి వారి కష్టసుఖాలను తెలుసుకున్నారు. ఇంకా మెరుగైన పరిపాలన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలోనే సాధ్యమౌతుందని స్పష్టం చేశారు. ప్రతి ఇంటికి వెళ్లి వారికి ముఖ్యమంత్రి పంపిన లేఖను అందజేస్తూ, నాలుగు సంవత్సరాలు దేవుడి దయతో, మీ అందరి చల్లని చూపులతో మంచి చేసామని, ఇక ముందు కుడా మంచి చేస్తామని, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. గ్రామసచివాలయవ్యవస్థ దానికి అనుసంధానంగా వాలంటీర్ల వ్యవస్థ ప్రభుత్వ పాలనను ప్రజల చెంతకు చేర్చాయని అన్నారు. ఏ గడపను త్రొక్కినా ముఖ్యమంత్రి పట్ల వారి కృతజ్ఞతాభావం వారి కళ్ళల్లో స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు. ఈ ప్రభుత్వం పదికాలాల పాటు సుపరిపాలన తో సాగడం ఖాయం అని ఎమ్మెల్యే కడుబండి అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శోభ హైమావతి, వైస్ ఎంపీపీ పినిశెట్టి వెంకటరమణ, స్టేట్ డైరెక్టర్ వాకాడ రాంబాబు, మండల పార్టీ అధ్యక్షుడు మోపాడ కుమార్, మండల జెసిఎస్ ఇంచార్జ్ వాకాడ సతీష్, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు కేతి వీరన్న, వీరనారాయణం సోంబాబు, వెంకటరమణ పేట ఆవాల కృష్ణ, సరిపల్లి గణేష్, మోపాడ కోటి, సర్పంచులు, ఎంపీటీసీలు, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర-గజపతినగరం: రైతులను ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని గజపతినగరం శాసనసభ్యులు అప్పల నరసయ్య అన్నారు గజపతినగరం పిఎసిఎస్ కార్యాలయం వద్ద శనివారం పీఏసీఎస్ అధ్యక్షులు కరణం ఆదినారాయణ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు అనంతరం ఆయన మాట్లాడుతూ తుఫాన్ నేపథ్యంలో ప్రభుత్వం ఆంక్షలు విధించలేదన్నారు ధాన్యం కొనుగోలుకు రైతులకు సహకరిస్తామని అన్నారు వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి అధికారులను తుఫాన్ నేపథ్యంలో రైతులు పంట నష్టపోవడానికి సహకరించి అంచనాలు ఎప్పటికప్పుడు తయారు చేశారు అని కొనియాడారు రైతులు రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యమును విక్రయించాలని తెలిపారు ఈ కార్యక్రమంలో జడ్పిటిసి గార తౌడు ఏఎంసీ చైర్మన్ ముత్యాల నాయుడు మండల పార్టీ అధ్యక్షులు బూడి వెంకటరావు వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సామంతుల పైడిరాజు వైసీపీ నాయకులు మండల సురేష్ బెల్లాన త్రినాధరావు కర్రి రాము నాయుడు రేగ సురేష్ కనకల సుబ్రమణ్యం పిఎసిఎస్ సీఈఓ నారాయణరావు మరియు సర్పంచులు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అలరించిన చిన్నారుల నృత్యాలు

తిలకించి పులకరించిన వేలాది జనం

విశాలాంధ్ర-వేపాడ: మండలంలోని వీలుపర్తి గ్రామంలో శనివారం జరిగిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా ఏర్పాటు చేసిన చిన్నారుల నృత్యాలు అందరినీ విశేషంగా అలరించాయి. మండల కేంద్రం వేపాడ శివారు బక్కునాయుడుపేటలో గల అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాల, కేజీబీవి పాఠశాల బాలికలతో పాటు జిల్లాలోని చీపురుపల్లికి చెందిన బాలికలు ప్రదర్శించిన దింసా, స్వచ్ఛభారత్,సాంప్రదాయరీతిలో ప్రదర్శిన భరతనాట్య నృత్య ప్రదర్శనలు సభలో పాల్గొన్న వేలాదిమంది ప్రజలను, జిల్లా అధికారులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అలాగే వివిధ శాఖల అధికారులు ఏర్పాటు చేసిన నెహ్రూ యువ కేంద్రం, ఉజ్వల గ్యాస్, ఆయుష్మాన్ భవ, సర్వే మరియు భూమి రికార్డుల శాఖ, పోస్టల్, గిరిజన ఉత్పత్తి దారులు, వేపాడ స్టేట్ బ్యాంకు, వ్యవసాయ శాఖ, ఐసీడియస్ అధికారులు, జల్ జీవన్ మిషన్ తదితర స్టాల్స్ అందరినీ ఆకట్టుకున్నాయి. అలాగే ఆర్ డబ్ల్యు ఎస్ అధికారులు 10వేల వాటర్ ప్యాకెట్స్, వెయ్యి వాటర్ బాటిల్స్ సమకూర్చారు. మండల స్థాయిలో ఎంపీడీఓ, తహసీల్దార్, వైస్సార్ క్రాంతిపథం ఏపీఎం, విద్యుత్, ఐసీడిఎస్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు వికసిత్ భారత్ సంకల్ప యాత్ర విజయవంతం చేసేందుకు చేసిన కృషి ఫలించింది.

తాటిపూడి రిజర్వాయర్ ను పరిశీలించిన బిజెపి బృందం

విశాలాంధ్ర-గంట్యాడ: తాటిపూడి జలాశయాన్ని విజయనగరం జిల్లా బిజెపి అధ్యక్షులు యన్.ఈశ్వరరావు కన్వీనర్ దుర్గాప్రసాద్ బృందం పరిశీలించడం జరిగినది. బిజెపి జిల్లా అధ్యక్షులు ఈశ్వరరావు మాట్లాడుతూ గంట్యాడ జామి మండలాల్లో ఉన్న వ్యవసాయ క్షేత్రాలకుసాగు నీరు అందించాలని తద్వారా రైతులు జీవితాలను మెరుగుపరచాలని అదేవిధంగా తాటిపూడి జలాశయాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని బోట్ రైడ్ ను ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బొబ్బిలి శ్రీను రాజేష్ వర్మ జిల్లా అధికార ప్రతినిధి శివారెడ్డి అల్లూరి కృష్ణంరాజు గంట్యాడ మండల అధ్యక్షులు కరక వెంకటరమణ ఎస్సీ మోర్చ జిల్లా అధ్యక్షులు అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్ లో 179కేసులు పరిష్కారం...

నలబై వేల జరిమాన : పస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ రోహిణి రావు

విశాలాంధ్ర-కురుపాం: కురుపాం పస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎం.రోహిణిరావు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన లోక్‌అదాలత్‌లో 179 కేసులు పరిష్కారం చేసి నలబై వేల ఆరువందల జరిమాన విదించారు. ఈ సందర్భంగా 336ఐపిసి కేసులు 20 ,లేబర్ కేసులు 02, ఎస్టీసిఐకేసులు 157 ప్రకటించారు. న్యాయవాదులు బరాటం చంద్ర మౌళీశ్వరరావు, ఐతం వాసుదేవరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ లో భోజనాలు

విశాలాంధ్ర-తెర్లాం: మండలంలో శనివారం తెర్లాం పిహెచ్సిలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణీలకు సత్యసాయి సేవాసమితి తరపున ఎంపీపీ ఎన్ ఉమాలక్ష్మి భోజనాలు వడ్డించారు. పీహెచ్ వైద్యాధికారి ఆర్ శ్రీనివాసరావు, డాక్టర్ దివ్యభారతి గర్భిణీలకు వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో సి హెచ్ ఓ భాస్కర్ రావు, ఫార్మసిస్ట్ ఎం నాగేశ్వరరావు, సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఐ గా బాధ్యతలు స్వీకరించిన షణ్ముఖ రావు

విశాలాంధ్ర -కురుపాం: పార్వతీపురం మన్యం జిల్లా లో ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఇటీవల చేపట్టిన బదిలీ లలో ఎల్విన్పేట పోలీసు స్టేషన్ నుంచి బదిలీ పై వచ్చి కురుపాం సబ్ ఇన్స్పెక్టర్ గా వి.షణ్ముఖరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. కురుపాం ఎస్ఐ సెహెచ్.ప్రసాద్ కురుపాం నుంచి బత్తిలి బదిలీ పై వెళ్ళారు. ఈసందర్భంగా నూతన ఎస్ ఐ షణ్ముఖరావు మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘుతాం కలగకుండా, ప్రజలతో ఫ్రెండ్లీ పోలీసు గా ఉండేందుకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

నాడు-నేడు ఫేస్-1 ఎస్ఎంఎఫ్ నిధులు కేటాయింపు

విశాలాంధ్ర-నెల్లిమర్ల: నాడు-నేడు ఫేస్-1 పాఠశాలలకు వచ్చిన ఎస్ఎంఎఫ్ నిధులును కేటాయింపు చేసినట్లు ఎంఇఓలు యుఎస్ఎన్ మూర్తి, ఈపు విజయ్ కుమార్ వెల్లడించారు. నెల్లిమర్ల ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్, ప్రయివేటు పాఠశాలల హెచ్ఎంలకు శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు వేరే జిల్లాల పాఠశాలకు అమౌంట్ పంపిణీ పూర్తి చేయాలని కోరారు. జగనన్న గోరిముద్ద తయారీ సమయంలో వంటవారు శుభ్రంగా ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఖచ్చితమైన సమాచారంతో ఈ ఏడాది యూడైస్‌ను నమోదు చేయాలని ఆదేశించారు.

అవినీతి కాంగ్రెస్ ను దేశం నుండి తరిమివేయాలి

జిల్లా బిజెపి అధ్యక్షులు ఎన్ఈఆర్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : ఆదాయపన్ను దాడుల్లో కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు ధీరజ్ సాహు ఇంటి ప్రాంగణంలో రూ.200 కోట్ల లభించడంతో అవినీతి కాంగ్రెస్ నాయకులకు వ్యతిరేకంగా జిల్లా బిజెపి ఆధ్వర్యంలో స్థానిక బాలాజీ జంక్షన్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద పార్టీ శ్రేణులతో కలసి నిరసన వ్యక్తంచేసారు ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) మాట్లాడుతూదేశం ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో ప్రగతిపథంలో దూసుకుపోతుంటే, స్వతంత్ర భారతదేశాన్ని తన పాలనలో కాంగ్రెస్ అవినీతి, కుంబకోణాలతో దేశాన్ని భ్రష్టు పట్టించి ఇప్పటికి అవినీతి నాయకులను పెంచి పోషిస్తుందని దుయ్యబట్టారు.అవినీతి కాంగ్రెస్ నాయకులను శిక్షించాలి, భారతమాతాకి జై అంటూ బిజెపి శ్రేణులు నినాదాలతో నిరసన వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బొబ్బిలి శ్రీను, బిజెపి నాయకులు శివారెడ్డి, సుధీర్, అబ్దుల్ ఆదిల్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు గండికోట శాంతి, ప్రధాన కార్యదర్శి నెల్లూరు సౌమ్య, నీలాపు దేవి, తదితరులు పాల్గొన్నారు

ఆడుదాం ఆంధ్ర కిట్లు పంపిణీ చేసిన మాజీ ఎంపి బొత్స ఝాన్సీ

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల కోసం క్రీడాకారులకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న కిట్లను మాజీ ఎంపీ బొత్సఝాన్సీలక్ష్మి శనివారం అందజేశారు. రాజీవ్ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో కిట్లను మాజీ ఎం.పి. అందజేశారు. కార్యక్రమంలో డి.ఎస్.డి.ఓ అచ్యుత్ కుమార్, క్రీడా ప్రాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించడం, వారి శక్తి సామర్థ్యాలు గుర్తించి వారు క్రీడల్లో మరింతగా రాణించేలా తీర్చిదిద్దాలి ఆడుదాం ఆంధ్ర పోటీలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోందని చెప్పారు.

బల్లకృష్ణపురంలో బాబు ష్యూరిటి-భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం

మేళతాళాలతో, నృత్యాలతో, తప్పిటగుళ్ళతో, మందుగుండుతో స్వాగతం

35 కుటుంబాలు టీడీపిలో చేరిక -రానున్న సాధారణ ఎన్నికలలో టీడీపీ విజయానికి సైనికులవలే కష్టపడాలి విజయ్‌చంద్ర, బేబీనాయనలు

విశాలాంధ్ర-సీతానగరం: మండలంలోని బల్లకృష్ణాపురం గ్రామంలో శనివారం సాయంత్రం బాబుష్యూరిటి-భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పార్వతీపురం, బొబ్బిలి టీడీపీ నియోజకవర్గ ఇన్చార్జిలు బోనెల విజయచంద్ర, బేబీనాయన, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులుముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ముందుగా గ్రామంలోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేయించారు. గ్రామానికి చెందిన బల్ల శివకుమార్, చింతల తిరుపతిరావుల ఆధ్వర్యాన యువత ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంను నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న నేతలకు మేళతాళాలతో, దింశా నృత్యాలతో, తప్పిటగుల్లతో, డప్పులతో పెద్దఎత్తున పటాస్ సామాగ్రి కాల్చి ఘనస్వాగతం పలికారు. గ్రామ ప్రారంభంలోఉన్న శ్రీఆంజనేయస్వామి మందిరంనుండి ఊరేగింపుగా అన్ని వీధులగుండా నినాదాలుచేస్తూ సమావేశ స్థలానికి చేరుకున్నారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్ కు గ్యారంటీ కార్యక్రమాన్ని గూర్చి పెద్దఎత్తున నినాదాలు చేశారు. ప్రధాన కూడలివద్ద ఏర్పాటుచేసిన టిడిపి జెండాను ఆవిష్కరించారు. గ్రామానికి చెందిన 35కుటుంబాలు టీడీపి పార్టీలో చేరగా వారికి బేబీనాయన, విజయ్‌చంద్ర వారికి టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.యువత పార్టీలోకి రావడం ఏంతో ఆనందంగా ఉందన్నారు.అనంతరం జరిగిన సమావేశంలో టీడీపీ ఇంచార్జిలు విజయ్ చంద్ర, బేబీ నాయనా టీడీపి మ్యానిఫెస్టును వివరిస్తూ రానున్న సాధారణ ఎన్నికలలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిగా చేసేందుకు కష్టపడి పనిచేయాలని కోరారు. నేడు టీడీపీ ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమాలకు కార్యకర్తలు అభిమానులు, ప్రజలు ఇస్తున్న మద్దతు గొప్పదని తెలిపారు. బల్లకృష్ణాపురం గ్రామంలో బాబు భవిషత్ కార్యక్రమానికి బ్రహ్మరథం పట్టడం చూస్తే టీడీపీ అధినేత చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం ఖాయమని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కొల్లి తిరుపతిరావు రౌతువేణు గోపాలనాయుడు, పిఎస్ఎన్,గొట్టాపు వెంకటనాయుడు బార్నాల సీతారాం, నారాయణరావు, నడిమింటి ధనంజయ, బుడితి శ్రీనివాసరావు, రెడ్డి సింహాచలం నాయుడు, సబ్బాన శ్రీనివాసరావు, ఎగిరెడ్డి భాస్కరరావునాయుడు, సూర్యనారాయణ, పెంట సత్యంనాయుడు, పెంట సురేష్, తెరేజమ్మ గరికయ్య, పారినాయుడు, మూడడ్ల వెంకటనాయుడు, పోల తిరుపతి, బొమ్మినాయిని లక్ష్మణరావు, చప్ప లక్ష్మణ, చప్ప గంగునాయుడు, దాసరి శివున్నాయుడు, గంగునాయిని సింహాచలం, శ్రీరాములు, వెంకట రమణ, కర్రి శంకరరావు, బొత్స వెంకటనాయుడు, గాజాపు తాతబాబు, తేలుశేఖర్, వంజరాపు గుంపస్వామి, బోను శ్రీను, యోగేశ్వరరావు, దాసరి సింహాచలం, పెంటఉమా, తేలు తిరుపతి, మర్రాపు శంకరరావు, సతీష్,సత్యనారాయణ, పకీరునాయుడు, సాయి, సుమన్, టీడిపి నాయకులతో జనసేన మండల పార్టీ అధ్యక్షుడు పాటి శ్రీనివాసరావు, ధనంజయనాయుడు జనసేన నాయకులు, టీడీపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు

కేంద్ర పథకాల పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలి

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ప్రజలకు అందజేస్తున్న సంక్షేమ పథకాలు పట్ల ప్రజలందరూ అవగాహన కలిగి ఉండాలని నియోజకవర్గ కన్వీనర్ సొండి సంజీవి అన్నారు. శనివారం మండలం లోని బాలగొడబ గ్రామంలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర. భాగంగా గ్రామంలోకి ప్రచార రథము చేరుకుంది.ఈ సమావేశంలో ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ కేంద్రం ద్వారా భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పలు సంక్షేమ పథకాలను అందజేస్తున్నారని తెలియజేస్తూ ఆయా పథకాలను ప్రజలకు వివరించారు.ఈ సమావేశంలో, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు కనకారావు,గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, ప్రజా ప్రతినిధులు, అంగన్వాడి సిబ్బంది, వైద్య సిబ్బంది మరియు వీఆర్వో సచివాలయ సిబ్బంది, మహిళ సంఘాలు,ప్రజలు పాల్గొన్నారు.

టిడిపి జిల్లా కార్యదర్శిగా నిమితులైన మజ్జి వెంకటేష్ గారికి అభినందనలు తెలిపిన జనసేన నాయకులు

జనసేన-టీడీపీ బలోపేతానికి ఉమ్మడి కార్యాచరణకు చర్చ

విశాలాంధ్ర-బెలగాం: టిడిపి పార్వతీపురం పట్టణ ప్రధాన కార్యదర్శిగా నిమితులైన మజ్జి వెంకటేష్ కు పార్వతీపురం జనసేన పార్టీ నాయకులు చందక అనీల్, గొర్లి చంటి, రాజాన రాంబాబు, మానేపల్లి ప్రవీణ్, సింగుమహంతి దినేష్, వంశీ తదితరులు శాలువా కప్పి సన్మానించి అభినందనలు తెలిపారు. అనంతరం జనసేన-టిడిపి ఎలా బలోపేతం చేయాలి, ఇకపై చేయవలసిన కార్యక్రమాలు పోరాటాల గురించి, పట్టణంలో ఉన్న 30వార్డులలో పర్యటన, ప్రజల సమస్యల దిశగా ఎలా ముందుకు వెళ్లాలి అనే అంశాలపైన చర్చించారు. అనంతరం ఇరు పార్టీ నాయకులు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో ప్రజలందరూ విసిగిపోయి ఉన్నారని, ఈ వైసీపీ దుర్మార్గ పాలన నుంచి విముక్తి పొందడం కోసం ప్రజలు కూడా ఎన్నికలు ఎప్పుడువస్తాయా అని ఎదురుచూస్తున్నారని అన్నారు. 2024లో ఉమ్మడి ప్రభుత్వం స్థాపిస్తామని జనసేన - టీడీపీ ఉమ్మడి పార్టీ విజయాన్ని ఆపడం ఎవరి తరం కాదని ఇరుపక్షాల నాయకులు నమ్మకంతో చెప్పారు.

చిక్కాల మాతృమూర్తికి ఘననివాళి

విశాలాంధ్ర-నెల్లిమర్ల: నెల్లిమర్ల నగర పంచాయతీ వైసిపి అధ్యక్షులు చిక్కాల సాంబ శివరావు మాతృమూర్తికి ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు నివాళ్లర్పించారు. నెల్లిమండలంలో చిక్కాల మాతృమూర్తి పెద్ద కర్మ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడ్డుకొండతో పాటు ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్ బాబు, నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్చార్జి అంధవరపు సూరిబాబుతో కలిసి ఘన నివాళ్లర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గదల సన్యాసినాయుడు, నగర పంచాయతీ చైర్ పర్సన్ బంగారు సరోజిని, వైస్ ఎంపీపీలు పతివాడ సత్యనారాయణ, సారిక వైకుంఠం, వైస్ చైర్మన్ సముద్రపు రామారావు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి ఆలయంలో పడిపూజ

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : పట్టణంలోని ఉడా కాలనీలో వేంచేసియున్న అయ్యప్ప స్వామి ఆలయంలో శనివారం స్వామివారి పడిపూజ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు కోట్ల సుగుణాకర రావు జ్యోతి ప్రజ్వలన గావించి ఈ పూజా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆలయ అభివృద్ధి కమిటీ కార్యదర్శి గురుస్వామి కందాల సాయిబాబా ఆధ్వర్యంలో శ్రీను గురుస్వామి తదితరులు పూజా కార్యక్రమంలో పాల్గొని అయ్యప్ప స్వామి గీతాలు ఆలపించారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల నుంచి స్వాములు అధిక సంఖ్యలో వచ్చి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సుబ్రహ్మణ్యస్వామి, మాలికాపురోత్తమ లతో కూడిన ఈ ఆలయంలో ఇరుముడులు కూడా సమర్పించవచ్చునని గురుస్వామి సాయిబాబా తెలిపారు. అత్యంత భక్తి శ్రద్ధలతో జరిగిన ఈ కార్యక్రమంలో ఫోర్ ఎస్ రాజు, లోక్సత్తా బాబ్జి తదితరులు పాల్గొన్నారు. అయ్యప్ప స్వామి చరిత్ర పుస్తకాలను ఫోరెస్ రాజు, కోట్ల సుగుణాకర్ రావు లు ఆవిష్కరించారు.

క్రైస్తవుల సమస్యల పరిష్కారానికి కృషి

రాష్ట్ర క్రిస్టియన్ అఫైర్స్ అడ్వైజర్ బాలస్వామి

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: క్రైస్తవుల సమస్యల పరిష్కారానికి తాను పూర్తిస్థాయిలో కృషి చేస్తున్నానని రాష్ట్ర క్రిస్టియన్ అఫైర్స్ అడ్వైజర్ ఎం బాలస్వామి అన్నారు. శనివారం స్థానిక ఎస్ ఎం డి చర్చి వద్ద విజయనగరం మన్యం జిల్లాల క్రైస్తవ నాయకుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎం బాలస్వామి మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న క్రైస్తవుల సమస్యలను తెలుసుకునేందుకు అన్ని జిల్లాల్లో పర్యట నలు చేపట్టడం జరుగుతుందన్నారు. మారుమూల గ్రామాలలో ఉండే క్రైస్తవులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. క్రైస్తవులకు సమాధి స్థలాల లేక పోవడం వల్ల అనేక ఇబ్బందులు గురవుతున్నారని దీనిని అధిగమించేందుకు ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందన్నారు. క్రిస్టియన్లకు కమ్యూనిటీ భవనం నిర్మించేందుకు ప్రయత్నం చేస్తున్నామని, అందరికీ విద్య, ఉద్యోగం, ఆరోగ్యం ప్రయత్నం చేస్తున్నామన్నారు రాష్ట్రంలో ఉండే క్రైస్తవులంతా కలిసి ఉండాలని గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే క్రైస్తవులంతా అన్యాయానికి గురి అయ్యారు అన్నారు .రానున్న ఎన్నికల్లో వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రిస్టియన్ మైనార్టీ అధ్యక్షురాలు ఆర్ ఆశా జాన్ ,ఎస్ ఎం డి చర్చ్ కార్యదర్శి ఆర్ ఎస్ జాన్ ,అధ్యక్షులు టి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోనియా గాంధీ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు సుంకరి సతీష్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం సోనియా గాంధీ జన్మదిన వేడుకలను నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో ఉండే రోగులకు పళ్ళు రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సరగడ రమేష్ కుమార్ మాట్లాడుతూ సోనియా గాంధీ జన్మదిన వేడుకలను జిల్లా వ్యాప్తంగా జరుపుకుంటున్నామని తెలిపారు. రానున్న కాలంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారం రావడం ఖాయం అన్నారు. కార్యక్రమంలో మైనారిటీ సెల్ నాయకులు షరీఫ్, నూర్జహాన్ బేగం, రెహమాన్, మోహన్ రావు, రాజేష్, చంద్రశేఖర్, సూరి బాబు, శ్రీను, మొదలగు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

ఇందిరమ్మ కాలనీలో ఆగని అక్రమాలు...దర్యాప్తు నిర్వహించాలి

విశాలాంధ్ర-బొబ్బిలి : పట్టణం ఇందిరమ్మ కాలనిలో స్థలాల అక్రమాలపై దర్యాప్తు నిర్వహించి చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా నాయకులు పి.శంకర్రావు డిమాండ్ చేశారు. శనివారం కాలనిలో అక్రమ కట్టడాలు సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో పరిశీలించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ఇందిరమ్మ కాలనిలో స్థలాల అక్రమాలు వెలుగుచూడడంతో రెవెన్యూ శాఖ అధికారులు సర్వే నిర్వహించారని. రెండవ లేఅవుట్లో అక్రమాలు జరిగినట్లు అస్థలాలు అన్యాక్రాంతం కాకుండా బోర్డులను తహసీల్దార్ బోర్డులను ఏర్పాటు చేశారని కానీ అక్రమార్కులు రెవెన్యూ శాఖ వారి దృష్టి మరల్చి మొదటి లేఅవుట్ సర్వే నెంబర్ 45,45, 628,634,635 లో ఖాళీగా ఉన్న స్థలాలను అమ్మ జూపుతున్నారన్నారు. ఈలేఅవుట్ లో మొదటి విడత లబ్ది దారులకు రెవెన్యూ శాఖ వారు పట్టాలు ఇవ్వకుండా పట్టాలను హౌసింగ్ శాఖ వారికి ఇవ్వడంతో దీనిని ఆసరాగా చేసుకొని, కాలనిలో వైసీపీ 21వ వార్డు ఇంచార్జి గా చాలా మణి అవుతున్న వ్యక్తి మరికొంత మంది కాలనివాసులతో కలసి ఖాళీ స్తాలలపై కన్నేసి హౌసింగ్ అధికారుల సహాయంతో రూ,,లక్ష నుండి రెండు లక్షలు వరకు బేరాలు పెడుతున్నారు. వెంటనే అధికారులు స్పందించి దర్యాప్తు నిర్వహించి ఖాళీ స్థలాలను పేదలకు పంపిణీ చేయాలని సిపియం పార్టీ గా డిమాండ్ చేస్తున్నామన్నారు.లేని పక్షంలో అక్రమాలకు సంబంధించిన ఆధారాలతో సహా సిపియం పార్టీ ప్రజాల ముందుకు తీసుకు వస్తామని అన్నారు. ఆయనతోపాటు పార్టీ నాయకులు కెసురేష్, కృష్ణ, బి.యుగంధర్, యస్.గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రైతన్నకు ప్రభుత్వం చేసే సాయం ఏమిటో..!

తడిచిన, రంగుమారిన ధాన్యం కొనాలని ప్రకటనలు

ముంపునకుగురైన రైతుల పరిస్థితి ఏంటి..?

అప్పన్నపాలెంలో నీట మునిగిన వరి పంట

విశాలాంధ్ర-జామి: ఈఏడాది ఎంతో కష్టాలకు ఓర్చి వరి పండించిన రైతులు ఎటువంటి ప్రకృతి కోపాలకు గురికాకుండా ధాన్యం సేకరించే సమయంలో మిచౌంగ్ తుఫాను రూపంలో మరోసారి రైతులను పూర్తిగా కుదేలు చేసింది.రాష్ట్ర వ్యాప్తంగా వరి రైతు తేరుకోలేని దెబ్బతిన్నాడు. అలాగే ఇతర పంటలు సైతం తుఫాను దాటికి పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఈనేపధ్యంలో రైతులపట్ల రాజకీయ పార్టీలు తమ సానుభూతిని వ్యక్తం చేస్తున్నాయి. గతకొద్ది రోజులుగా వివిధ పార్టీల నేతలు, ప్రజా ప్రతినిధులు రైతులను ఓదార్పు చేసే యాత్రలను చేపట్టారు. అయితే ఇంతకీ ఈప్రభుత్వం రైతులకు ఎటువంటి సాయం చేస్తుంది అనేది రైతులలో నెలకొన్న అనుమానం. ప్రతిపక్ష పార్టీ నేతల భరోసా మాట పక్కన బెడితే అధికార పార్టీ నేతలు, ఎమ్మెల్యేలు చేస్తున్న ప్రకటనలపట్ల రైతులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు వందలాది ఎకరాలు నీటి ముంపుకు గురై పూర్తిగా నాశనమయ్యాయి. ఇక సేకరించిన ధాన్యం ఎండబెట్టకముందే వర్షాలకు తడిచిపోయింది. ఇక పొలాల్లో కుప్పలు కాస్తా దాదాపు సగం వరకు నీటిలోనే మునిగిపోయి ఉన్నాయి. ఇప్పుడిప్పుడే ఎండ కాస్తుండడంతో రైతులు ధాన్యం చేసును ఆరబెట్టే పనిలో ఉన్నారు. ఇదిలా వుండగా ప్రభుత్వం సాయం ఏవిదంగా ఇస్తారో, అసలు ఇస్తారో లేదో అనే సందేహం వ్యక్తమవుతోంది. తుఫాను సాయం పై ప్రభుత్వం ఎటువంటి జీవోలు విడుదల చేయలేదు. కేవలం రైతులను ఆదుకుంటా మని చెబుతున్నారు. కానీ ఏవిదంగా లెక్కకట్టి సాయం అందిస్తారో చెప్పడం లేదు. మరోవైపు వ్యవసాయ అధికారులు జరిగిన పంట నష్టాలను అంచనా వేస్తున్నారు. వాస్తవానికి పంటలకు భీమా సదుపాయం వున్నా కేవలం కోత అవ్వకముందే వర్తిస్తుందని తెలుస్తోంది. ఈనేపధ్యంలో వరి కోతలు జరిగిన అనంతరం పంట నష్టంకు ఎటువంటి భీమా రాదని తెలుస్తోంది. ధాన్యం కళ్ళాల్లో ఉన్నప్పుడు తడవడంతో పాటు, పొలాల్లో ఉన్న కుప్పలు కూడా నీటి నానిపోవడంతో చాలా వరకు నష్టాన్ని చవిచూడాల్సి ఉంటుంది. నేతలు మాత్రం తడిచిన ధాన్యం,రంగుమారిన ధాన్యం తీసుకుంటామని హామీ ఇస్తున్నారు. కానీ ఆచరణలో అమలు చేస్తే కొంత వరకు రైతులు సంతోషపడతారని రైతాంగం ఆవేదన వ్యక్తం చేస్తోంది. వరి రైతుల పట్ల ప్రభుత్వం వెంటనే తన వైఖరిని బైటపెట్టాలని ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి.

ఎమ్మెల్సీ రఘురాజుని కలిసిన పెదఖండేపల్లి నాయకులు

విశాలాంధ్ర-శృంగవరపుకోట: సిఎం జగన్మోహన్ రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలని దృఢమైన సంకల్పంతో తిరుమలకు పాదయాత్ర చేస్తున్న ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజుని శనివారం అనగా 32వ రోజు ఉదయం కావలి గ్రామం దగ్గర రామదూత స్వామి అనాధపిల్లల ఆశ్రమం వద్ద ఎస్.కోట మండలం, పెదఖండేపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ దొడ్డ నారాయణ రావు, నాయకులు సుంకరి బుల్లి, చల్లా రాము తదితరులు కలిసి సంఘీభావం తెలిపారు. ఎమ్మెల్సీ రఘురాజు, ఎస్.కోటకు చెందిన నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో కలిసి పెదఖండేపల్లి నాయకులు పాదయాత్ర చేశారు.

రైతులకు తక్షణం నష్ట పరిహారం అందించాలి

టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కరణం శివరామ కృష్ణ

విశాలాంధ్ర-గజపతినగరం: మిచాంగ్ తుఫాన్ వల్ల వరి నష్టపోయిణ ప్రతీ రైతుకు ప్రభుత్వం నష్ట పరిహారం తక్షణం చెల్లించాలని టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కరణం శివరామ కృష్ణ కోరారు.శనివారం మండలంలోని గెద్దపేట గ్రామంలో మొలకెత్తిన వరిపంటను పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు పంట నష్టం పై తమ గోడును శివరామ కృష్ణకు వినిపించారు. కాగా తుఫాన్ వలన ఇప్పటికి వరి కుప్పలు నీటిలో మునిగి ఉన్నాయని అంతే కాకుండా చాలా వరకు వరి మొలకెత్తి రైతుకు తీవ్ర నష్టాన్ని కల్గి0చాయని శివరామకృష్ణ అన్నారు. ప్రభుత్వం ఆర్భాటంగా రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసిందని అయితే క్షేత్ర స్తాయిలో వరి పంట నష్టాన్ని అంచనా వేయడం లో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. మొక్కుబడిగా పంట నష్ట సర్వేలను నిర్వహించి అధికారులు చేతులు దులుపుకున్నారని విమర్శించారు. కష్టాలలో ఉన్న రైతుకు ఎకరాకు ముప్పై వేలు రూపాయలు తక్షణం ఆర్థిక సహాయాన్ని అందించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని శివరామ కృష్ణ డిమాండ్ చేసారు. చేతికి వచ్చిన పంట నేల పాలు కావడంతో అన్నదాతలు కన్నీరు మున్నీరవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేసారు. కాగా తడిచిన ధాన్యానికి ప్రభుత్వం గిట్టుబాటు ధర ప్రకటించాలని శివరామ కృష్ణ కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

మెగా లోక్ అదాలత్ కక్షిదార్లకు భోజనాలు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : జిల్లా కోర్టులో డిసెంబరు 9న నిర్వహించిన మెగా లోక్ అదాలత్ కక్షిదార్లకు న్యాయ వాది అంజనీ కుమార్ , రూరల్, వన్ టౌన్ పోలీసులు సంయుక్తంగా భోజనాలు ఏర్పాటు చేసి, అందరి మన్ననలు పొందారు.పూల్ బాగ్ ప్రాంతంలోగల జిల్లా కోర్టు ప్రాంగణంలో మెగా లోక్ అదాలత్ డిసెంబరు 9న నిర్వహించారు. ఈ మెగా లోక్ అదాలత్ లో పాల్గొనేందుకు వివిధ ప్రాంతాల నుండి కక్షిదార్లు వివిధ కోర్టుల్లో విచారణలో ఉన్న కేసుల్లోను, దర్యాప్తు దశలో ఉన్న కేసుల్లో రాజీ అయ్యేందుకు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సాయంత్రం వరకు జరిగిన మెగా లోక్ అదాలత్ పాల్గొన్న కక్షిదార్లు, ప్రజలు మధ్యాహ్నం భోజనాలు నిమిత్తం ఇబ్బంది పడకుండా ఉండేందుకు గాను వారికి భోజనాలు ఏర్పాటు చేసేందుకు గాను ప్రముఖ న్యాయవాది అంజనీ కుమార్ స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. మంచి పని చేస్తే చేదోడుగా ఉండేందుకు ఎల్లప్పుడూ ముందు ఉండే రూరల్ సిఐ టివి తిరుపతిరావు, వన్ టౌన్ సిఐ బి.వెంకటరావు కూడా తమవంతు సహాయాన్ని అందించేందుకు ముందుకు వచ్చి, అవసరమైన భోజన ఏర్పాట్లలో తమవంతు పాత్ర పోషించారు.వివిధ శాఖల నుండి వచ్చిన ఉద్యోగులు భోజనాలు చేసి, మంచి కార్యక్రమం చేపట్టిన అధికార్లు, న్యాయవాదిని అభినందించారు. సిఐలు, న్యాయవాది మరియు ఇతర అధికారులు స్వయంగా వడ్డన చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐ లు గణేష్, భాస్కరరావు మరియు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వెంకటేశ్వర సన్నిధిలో 2000 మంది కి అన్న ప్రసాదం వితరణ

విశాలాంధ్ర-సీతంపేట: మండల కేంద్రంలో శ్రీ వెంకటేశ్వర దివ్య క్షేత్రం తిరుమల తిరుపతి దేవస్థానం సీతంపేట నందు ఈరోజు మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ కార్యక్రమం సుమారు 2000 మంది భక్తులు హాజరై ఉన్నారు. ఈ కార్యక్రమానికి దాతలు గెంబలి వెంకటరమణ దంపతులు శివశంకర్ ఎంటర్ప్రైజెస్ వారు చే జరిపించడం జరిగినది, భక్తులు సదురా ప్రాంతాల నుండి కార్తీక శనివారం పర్వదినాన అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ వెంకటేశ్వర స్వామి దర్శించుకుని వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొని స్వామివారి కరుణ కటాక్షం పొంది ఉన్నారు. ఈ కార్యక్రమంలో టిటిడి టెంపుల్ ఇన్స్పెక్టర్ మరియు రిటైర్డ్ ప్రిన్సిపల్ మజ్జి .సత్యం, ఐ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీఅయ్యప్ప స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్సీ రఘురాజు

విశాలాంధ్ర-శృంగవరపుకోట: సి.ఎం. జగన్మోహన్ రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలని దృఢమైన సంకల్పముతో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు చేస్తున్న జయహో జగనన్న పాదయాత్రలో భాగంగా శనివారం అనగా 32వ రోజు మధ్యాహ్న భోజన విరామ ప్రదేశమైన కావలి నియోజకవర్గ మండల కేంద్రంలోని రుద్రకోట గ్రామంలో గల శ్రీ అయ్యప్పస్వామి ఆలయంలో ఎమ్మెల్సీ రఘురాజు ప్రత్యేక పూజలు చేసారు. ఈ సందర్భముగా ఆలయ అర్చకులు ఎమ్మెల్సీ రఘురాజుకి వేద ఆశీర్వచనములు అందజేసారు. అనంతరం, అయ్యప్పస్వామి భక్తులకోసం ఏర్పాటు చేసిన అన్నసమారాధనలో పాల్గొని, అయ్యప్ప మాలధారులకు స్వయంగా స్వామివారి ప్రసాదములను ఎమ్మెల్సీ వడ్డించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి చైర్మన్ ఎమ్.జగన్మోహనరెడ్డి, ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ రెడ్డి, సభ్యులు డా.పి.చిన్న, ఏ.రవీంద్ర రెడ్డి, ఎన్.జగదీష్ రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు వి.చంద్రశేఖర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నాదెండ్ల మనోహర్ ను కలిసిన గురానఅయ్యలు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ ని జనసేన పార్టీ జిల్లా నాయకులు గురాన అయ్యలు విశాఖపట్నంలో మర్యాద పూర్వకంగా కలిసి జిల్లా రాజకీయాల గురించి చర్చించారు. ఈ సందర్భంగా గురాన అయ్యలు మాట్లాడుతూ ప్రస్తుతం వైసీపీ ప్రభుత్వానికి ప్రజలంతా బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. రానున్నకాలంలో జనసేన టిడిపి కూటమికి ఓట్లు వేసి గెలిపించాలన్నారు. జనసేన పార్టీ జిల్లాలో బలోపేతం చేసేందుకు తమ వంతు కృషి చేస్తున్నామన్నారు.

నేటి యువతరం పుస్తకాలు చదవాలి..

విశాలాంధ్ర-చీపురుపల్లి : సత్యరామా డిగ్రీ కాలేజ్ అవరణంలో ఆశయ రూరల్ లైబ్రరీ మరియు ఆశయ యూత్ అసోషియేషన్ వారి ఆధ్వర్యంలో మొబైల్ బైక్ లైబ్రరీ పర్యటన చేశారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం విద్యార్థులు యువత పుస్తక పఠనం పై అవగాహన కల్పించడం వారికి పుస్తకాలు ఇచ్చి చదివించడం జరుగుతుంది అలాగే ఇంటికి పుస్తకాలు ఇవ్వడం జరుగుతుంది. అలాగే ఈ సంవత్సరం నుండి 12 పాఠశాల మరియు కాలేజ్ దత్తత తీసుకుని ఒక రోజు మొబైల్ లైబ్రరీ వెళ్లి వారితో ఒక రోజు పుస్తకాలు చదివించడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో ఆశయ సంస్థ అధ్యక్షులు రెడ్డి రమణ మాట్లాడుతూ మహోన్నత విజ్ఞానాన్ని అందించేది పుస్తకం మాత్రమే బుక్స్ చదివే అలవాటు ఉన్నవారిలో కాన్సెంట్రేషన్, సూపర్ మెమోరీ, రీసనింగ్, డెసిషన్ మేకింగ్ మాములు వ్యక్తుల కన్నా ఎక్కువగా వుంటాయని డాక్టర్ల పరిశోధనలో తేలింది. అలాగే రిలేషన్స్ ని పర్ఫెక్ట్ గా మెయింటైన్ చేయటానికి, ఎమోషనల్ బాలన్స్ కి కూడా బుక్ రీడింగ్ హెల్ప్ చేస్తుంది. ఆరు నిమిషాల పాటు చదవడం ద్వారా మానసిక ఒత్తిడి మూడింట్లో రెండింతలు తగ్గి పోతుందని అధ్యయనాలు వెల్లడించాయి.కథలు సాహిత్యం పుస్తకాలు జాతీయ నాయ కులు పుస్తకాలు ఆధ్యాత్మిక పుస్తకాలు నేటి తరం చదవాలని అన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ ముకుందరావు, లెక్చరర్ యం. లక్ష్మణరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

కోడూరులో ముగిసిన గడపగడపకు మన ప్రభుత్వం



విశాలాంధ్ర-తెర్లాం/బాడంగి: మండలం కోడూరులో శనివారం స్థానిక ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పల నాయుడు, ఆయన సోదరులు వేణుగోపాల్ నాయుడు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై లబ్ధిదారుని బుక్లెట్ చదివి వినిపించారు. కార్యక్రమంలో ఈ కార్యక్ర మంలో ఎంపీపీ భోగి గౌరీ, సర్పంచ్ భోగి. జ్యోతి, వైస్ సర్పంచ్ రెడ్డి కృష్ణమూర్తి, సీనియర్ నాయకులు మధుసూదన్ రావు, ఎంపిటిసి మరి పిశ్రీదేవి జడ్పిటిసి పెద్దింటి రామారావు, ఎస్ ఎస్సై, పంచాయతీ కార్యదర్శి, సచివాలయం సిబ్బంది వాలంటీర్లు పాల్గొన్నారు.

వైకాప మద్దతుదారులకే జిరాయితీ పట్టాలు

విశాలాంధ్ర-రామభద్రపురం: వైయస్సార్ మద్దతుదారులకే డి పట్టా భూములను జిరాయా తి భూములుగా నాయకులు అధికారులు చేయిస్తున్నారని తారాపురం సర్పంచ్ ప్రతినిధి బె వర సీతారాం అన్నారు. శనివారం తాసిల్దార్ సులోచన రాణి కి తారాపురం డిపట్ట రైతులతో వినతిపత్రం అందజేశారు. అనంతరం సీతారాం మాట్లాడుతూ ప్రభుత్వము డి పట్టా భూములు ఉన్న వారందరికీ పూర్తి హక్కులు కల్పిస్తామని మాయ మాటలు చెప్పిందని అన్నారు . రైతుల వద్ద నుంచి వివరాలు సేకరించి నెల రోజులు తిప్పి ముఖ్యమంత్రి మాట తప్పారని అన్నారు. కేవలం వైయస్సార్ మద్దతుగాళ్ళకే డి పట్టా భూములను జిరాయి తీ భూములుగా మార్చడం దారుణమని అన్నారు. ఈ కార్యక్రమంలో తారాపురం గ్రామానికి చెందిన రైతులు పాల్గొన్నారు.

11-16 వరకు సచివాలయాల విధివిధానాలపై శిక్షణ : ఎంపీడీఓ

విశాలాంధ్ర-కురుపాం: మండలం లోని 20సచివాలలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శిలు వాలంటీర్లకు ఈనెల 11నుంచి 16వతేదీ వరకూ రెండు దఫాలుగా గ్రామ సచివాలయాల సేవలు, విధివిధానాలు పై శిక్షణ ఇవ్వనున్నట్లు ఇన్చార్జి ఎంపీడీవో జి.రమేష్ బాబు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామ సచివాలయాల ద్వారా మరిన్ని విస్తృత సేవలు అత్యంత పారదర్శకంగా అందించాలనే ఉద్దేశ్యం తో పంచాయతీ కార్యదర్శి లకు ,గ్రామ వాలంటీర్లకు ,ఇతర సిబ్బందికి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

నల్ల బజారుకు తరలిస్తున్న 40 బస్తాల ప్రజా పంపిణీ బియ్యంపట్టివేత

విశాలాంధ్ర-బొబ్బిలి : పట్టణం ఓంకార్ టాకీస్ దారిలో స్పెషల్ బ్రాంచ్ పోలీసులు బొలెరో వాహనంలో 40 బస్తాలు 2 వేల కేజీలు ప్రజా పంపిణీ బియ్యం ను సీతానగరం మండలం జానుమల్ల వలస గ్రామానికి చెందిన కేతల ధనంజయ్ రావు చీపురుపల్లి తరలిస్తుండగా స్పెషల్ బ్రాంచ్ పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు బొలెరో వాహనంలో 40 బస్తాల్లో నిల్వచేసిన రెండు వేల కేజీలు ప్రజా పంపిణీ బియ్యాన్ని పట్టుకొని స్థానిక పోలీసులకు అప్పగించారు. స్థానిక పోలీసులు పట్టుబడిన ప్రజా పంపిణీ బియ్యంతో పాటు వాహనాన్ని స్థానిక సివిల్ సప్లై అధికారులకు అప్పగించడంతో తాసిల్దార్ డోల రాజేశ్వరరావు ఆదేశాల మేరకు సివిల్ సప్లై ఉప తాసిల్దార్ రెడ్డి సాయి కృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు విలేకరులకు తెలిపారు. పట్టుబడిన బియ్యం చీపురుపల్లిలో పౌల్ట్రీ ఫారాలకు తరలిస్తున్నట్లు తెలిపారు. పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి నల్ల బజార్ తరలిస్తున్న వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుని పట్టుబడిన వాహనాన్ని ప్రభుత్వం సీజ్ చేసి వేలం వేసి వేలం ద్వారా వచ్చిన నిధులను ప్రభుత్వ ఖజానాలో జమ చేయాలని రేషన్ లబ్ధిదారులు ప్రజలు ప్రజా సంఘాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

దేశంలో ఎక్కడా లేనివిధంగా నాణ్యమైన ప్రభుత్వ సేవలు



విశాలాంధ్ర-చీపురుపల్లి : దేశంలో ఎక్కడా లేనివిధంగా గ్రామంలో నాణ్యమైన ప్రభుత్వ సేవలు సచివాలయ మరియు వాలంటీర్ వ్యవస్థల ద్వారా అందించిన ఘనత జగన్ మోహన్ రెడ్డి ది జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) అన్నారు. జిల్లాలో మొదటి డిజిటల్ లైబ్రరీ ప్రారంభోత్సవం చేసిన జడ్పీ చైర్మన్, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ శనివారం చీపురుపల్లి మండలం కర్లాం గ్రామంలో డిజిటల్ లైబ్రరీ, బల్క్ మీద కూలింగ్ సెంటర్ నూతన భవనాలలో ప్రారంభోత్సవం చేశారు అనంతరం గ్రామంలో ఆంధ్రప్రదేశ్ కి జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమంలో భాగంగా వారు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సచివాలయం పరిధిలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా గ్రామ ప్రజలు లబ్ది పొందిన 23.51కోట్ల రూపాయల యొక్క డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శ్రీమతి ఇప్పిలి వెంకట నరసమ్మ, జడ్పిటిసి వలిరెడ్డి శిరీష, మండల నాయకులు ఇప్పిలి అనంత్, వలిరెడ్డి శ్రీనివాస్ నాయుడు, వైస్ ఎంపీపీ లు, మండలంలో గల సర్పంచులు, ఎంపీటీసీలు, ఇతర ప్రజా ప్రతినిధులు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, మండల అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

రైతులు బాధల్లో ఉంటే.. ఆడుదాం రా అంటారా ?

టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యురాలు గుమ్మడి సంధ్యారాణి



విశాలాంధ్ర-పాచిపెంట: తుఫాన్ ప్రభావంతో పంటల నష్టపోయి కన్నీరు మున్నీరైన రైతులను చూడకుండా టార్గెట్లు పూర్తి చేయడం కోసం ఆడుదాం రా అంటారా అంటూ మాజీ ఎమ్మెల్సీ టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యురాలు గుమ్మడి సంధ్యారాణి అన్నారు మండలంలో గల పనుకోవలస గ్రామ పరిసరాలైన ప్రాంతాలలో శనివారం నీట మునిగిన పంటలను ఆమె పరిశీలించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ జగన్ ప్రభుత్వానికి రైతు కన్నీరు కనిపించదని అన్నారు టార్గెట్లు పూర్తి కోసం కన్నీరు పెడుతున్న అన్నదాతను వాదార్చడం ప్రజా ప్రతినిధులకు గాని అధికారులకు గాని పట్టడం లేదని అన్నారు తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి అన్నదాతను ఆదుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని హామీలు ఇస్తున్నారు తప్ప కార్యాచరణ దాల్చడం లేదని అన్నారు ఇప్పటికైనా నిద్రలేచి తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులను ఆదుకొని రైతులకు నష్ట పరిహారం అందించే విధంగా పరిహారం చర్యలు చేపట్టాలని కోరారు ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బొంజుదేవ్ మండల పార్టీ అధ్యక్షులు పిన్నింటి ప్రసాదు బాబు పాంచాలి సర్పంచ్ గూడెం యుగంధర్ తదితరులు పాల్గొన్నారు. పాచిపెంట మండలం, పణుకువలసలో తుఫాను వల్ల, నీట మునిగిన పంట పొలాలను పరిశీలించి, రైతులను పరామర్శ చేసాం.

నియోజకవర్గంలో ఎన్ని ఎకరాలకు క్రాప్ ఇన్సూరెన్స్ చేశారు?

కేంద్రం మూడు వారాలుగా హెచ్చరిస్తున్నా, జగన్ ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్లనే రైతులు తీవ్రంగా నష్టపోయారు.. ముందు రోజు వరకు పట్టించుకోకుండా, తుఫాను రోజు మాత్రమే అధికారులను ఆదేశించడం వల్ల ఏం ఫలితం ఉంటుంది. జగన్ ప్రభుత్వానికి కనీస బాధ్యత లేకపోవడం వల్లనే రైతులను అప్రమత్తం చేయలేదని, తడిచిన ధాన్యం కొనాలని తెలుగుదేశం డిమాండ్ చేస్తుండటంతో కొనేస్తాం అంటున్నారు గాని, ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకుండా ఎలా కొంటారని ప్రశ్నిస్తున్నాం. తుఫానుతో మడుల్లో నీరు ప్రవహించడంతో వందల ఏకరాల్లో పంట నేలకొరిగిందని, మిగిలిన పంట నీటిలో వుండి తెగుళ్ల సోకి కుళ్లిపోయే ప్రమాదం వుందని, చేలల్లో మూడు నుండి నాలుగు అడుగుల మేర నీరు నిలిచిపోవడంతో పంట కుళ్లిపోయే ప్రమాదం వుందని రైతులు తెలిపారు. తుఫాన్ వల్ల చాలా ప్రాంతాల్లో వర్షం కురవడంతో రైతుల తమ పంటను కాపాడుకోవడానికి చాలా అవస్థలు పడుతున్నారు.. వరి పంటను కోసి అమ్మకానికి సిద్ధంగా ఉన్న పంటను వాహనాలు లేకపోవడంతో కొంత మంది రైతులు కిరాయి వాహనాలను ఏర్పాటు చేసుకొని ధాన్యాన్ని తరలిస్తున్నారు. మరి కొంతమంది రైతులు కల్లాల్లోనే కుప్పలుగా వేసి తార్పన్లు కప్పుకుంటున్నారు. ఈ సంవత్సరం సాగునీరు అందక చాలామంది రైతుల పంటలు వేయలేదు%ా% వేసిన కొన్ని పంటలు పాడైపోయాయి, కొంతమంది వ్యయ ప్రయాసలు పడి మోటార్ల సాయంతో సాగునీరు పొలాలకు అందించి, పంటను పండించుకున్నారు. చేతికందిన పంటను ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా పంటను కొనడం ప్రారంభించకపోవడం, ఈలోగా తుఫాను ప్రభావంతో రైతులు కళ్ళాల్లోనే ధాన్యాన్ని భద్రపరుచుకుని చాలా ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటివరకు చాలా ఏకరాల్లో వరి కోతలు పూర్తయ్యాయి, మరి కొంత వరి కోయాల్సి వుంది. అయితే చాలా వరకు నూర్పిళ్లు జరగలేదు, తుఫాను కారణంగా రైతులు పంటను పొలాల్లోనే కుప్పలుగా వేస్తున్నారు. మూడు రోజులుగా వర్షం కురుస్తుండడంతో తేమ పెరిగి నాణ్యత దెబ్బతిని రైతులు ఆందోళన చెందుతున్నారు. తడిసిన ధాన్యాన్ని నిబంధనల పేరుతో ఆపకుండా గిట్టుబాటు ధరకే కొనుగోలు చేయాలని, రవాణాకు అవసరమైన మేరకు వాహనాలను ఏర్పాటు చేసి కొనుగోలు కేంద్రాలకు తరలించాలని, కొన్నపంటకి పూర్వంలా సంవత్సరాల తరబడి రైతులను తిప్పకుండా వెంటనే డబ్బులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని మరియు అధికారులను డిమాండ్ చేస్తున్నాను. ఈ ప్రభుత్వం ఏర్పడి నాలుగున్నర ఏళ్లలో పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించడంలో విఫలమైంది. చాలామంది రైతు కుటుంబాలు వ్యవసాయమే జీవనాధారంగా చేసుకొని అప్పులు చేసి మరి వ్యవసాయం చేస్తున్నారు, ఈ ప్రభుత్వం రైతులను ఆదుకోకపోవడంతో చాలామంది రైతు కుటుంబాలు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. కావున ఈ చివరి 4 నెలల్లో నైనా పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని లేనిపక్షంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున నిరసన తెలియజేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నాం. పొలిట్బ్యూరో సభ్యులు మరియు సాలూరు నియోజకవర్గ ఇన్చార్జి గుమ్మిడి సంధ్యారాణి, మాజీ శాసన సభ్యులు భంజుదేవ్, మండల అధ్యక్షులు పిన్నింటి ప్రసాద్ బాబు, సర్పంచులు గూడేపు యుగంధర్, పోలినాయుడు, రౌతు తిరుపతి, గొర్లే సత్యం, దండి మోహన్ , కొట్యాడ సత్యన్నారాయణ, గంట భాస్కర్ ,బ్రహ్మన్న, ప్రశాంత్, దత్తి పైడి నాయుడు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.